బాలికా విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలు ఆచరణలో ఫెయిల్ అయ్యాయి. అధ్యాపకులను నియమించకపోవడం, పుస్తకాలను సకాలంలో పంపిణీ చేయకపోవడం, సౌకర్యాల కల్పనలో విఫలమవడంతో అవి తుస్సుమన్నాయి. జిల్లాలో ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లో తొమ్మిది బాలికా జూనియర్ కళాశాలలు కొనసాగుతుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా మరో 11 కోఎడ్యుకేషన్ కాలేజీలను ప్రారంభించారు. వాటిలో ప్రవేశాలకు విద్యార్థులు ససేమిరా అంటున్నారు. గత రెండేళ్లలో హైస్కూల్ ప్లస్‌లలో చదివిన విద్యార్థుల ఉత్తీర్ణత కూడా కేవలం 10నుంచి 26శాతం మాత్రమే ఉంది. దీనికితోడు మొదటి సంవత్సరం ఫలితాల్లో ఐదు, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రెండు కాలేజీల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈనేపథ్యంలో వాటిల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు కూడా విముఖత చూపుతున్నారు. దీంతో అవి అట్టర్ ఫ్లాప్ అయ్యాయి.

హైస్కూల్ ప్లస్ ఫెయిల్

పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు కరువు

చదువుకునేందుకు పుస్తకాలు లేవు

ఆర్భాటంగా ప్రారంభించి వదిలేసిన గత ప్రభుత్వం

అంతంతమాత్రంగానే అడ్మిషన్లు

ఫలితాల్లోనూ డీలా





బేస్తవారపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



11 కొత్త కళాశాలలు

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 11 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. గతంలో ఉన్నవన్నీ బాలికా జూనియర్ కళాశాలలు కావడంతో విద్యార్థులు ఆశించిన స్థాయిలో చేరలేదు. దీంతో కొత్తగా కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. నూతనంగా బేస్తవారపేట, ముండ్లపాడు, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, కొత్తపట్నం, కురిచేడు, పుల్లలచెరువు, సంతనూతలపాడు, తర్లుబాడు, పి.నాగులవరం, జరుగుమల్లిలో కళాశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తెరిచింది. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఏదైనా రెండింటిని ఈ కళాశాలల హెచ్‌ఎంలు ఎంపిక చేసుకొని ప్రారంభించారు

ఫలితాలు అంతంతమాత్రమే

హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరీక్షా ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వీటిని ప్రారంభించిన 2023లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 13 కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 188 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది మాత్రమే పాసయ్యారు. ఐదు కళాశాలల్లో ఒక్కరు కూడా ఉత్తీర్ణులు కాలేదు. 2024 మార్చిలో జరిగిన పరీక్షలకు విభజిత అనంతరం జిల్లాలోని తొమ్మిది కళాశాలల నుంచి 81 మంది పరీక్షకు హాజరు కాగా కేవలం 21 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రెండు కళాశాలల్లో ఒక్కరు కూడా పాస్ కాలేదు. 2024 మార్చిలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 9 కళాశాలల నుంచి 145 మంది హాజరు కాగా కేవలం 38 మంది మాత్రమే పాసయ్యారు. అవసరమైన సౌకర్యాల కల్పనలో గత ప్రభుత్వ వైఫల్యం ఈ కళాశాలలకు శాపంగా మారింది.

ఒంగోలు (విద్య), జూలై 14 : బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పేరుతో బాలికా జూనియర్ కళాశాలలను ప్రారంభించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేసింది. పల్లె ప్రాంతాల్లో విద్యార్థినులు పదో తరగతి పాసైన తర్వాత ఇంటర్, డిగ్రీల్లో చేరకుండా ఎక్కువ మంది చదువులకు స్వస్తి చెప్తున్నారు. ఈ పరిస్థితిని మార్చాలన్న ఉద్దేశంతో జడ్పీ హైస్కూళ్లలో బాలికా జూనియర్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. 2023లో జిల్లాలో తొలుత 13 హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించారు. వీటిలో నాలుగు కళాశాలలు బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లగా విభజిత జిల్లాలో తొమ్మిది కొనసాగుతున్నాయి.

చేరేందుకు విద్యార్థులు ససేమిరా

హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ససేమిరా అంటున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, మెడిసిన్ ఇతర ప్రొఫెషనల్ కోర్సుల వైపు దృష్టి సారించడం, హైస్కూల్ ప్లస్‌లలో బోధనకు సిబ్బంది లేకపోవడంతో ప్రవేశాలకు ముందుకు రావడం లేదు. తల్లిదండ్రులు కూడా ప్రైవేటు, కార్పొరేట్ వైపు మొగ్గు చూపుతుండటంతో ఈ కళాశాలలు పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. ప్రవేశాల కోసం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మొక్కుబడిగా ప్రతి కళాశాలలో 10నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే చేరుతున్నారు.

పాఠాలు చెప్పేవారేరి?

ఆర్భాటంగా కళాశాలలను ప్రారంభించిన గత ప్రభుత్వం అక్కడ బోధించేందుకు టీచర్లను (పీజీటీలను) నియమించలేదు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా టీచర్లు లేకపోవడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నేటికీ విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు అందలేదు. హైస్కూళ్లలో ఇప్పటికే స్కూలు అసిస్టెంట్లకు పనిభారం పెరిగి సతమతమవుతున్నారు. ఈనేపథ్యంలో హైస్కూల్ ప్లస్ తరగతులకు వెళ్లేందుకు వారు ఇష్టపడటం లేదు. కళాశాలలకు ప్రత్యేకంగా టీచర్లను నియమించకపోవడంతో పాఠాలు చెప్పేవారు కరువయ్యారు.



ఒంగోలులో కురుస్తున్న వర్షం

ముసురేసింది..!

జిల్లావ్యాప్తంగా వర్షం

ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు

ఒంగోలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. మూడు రోజుల నుంచి ఇంచుమించు అన్ని ప్రాంతాల్లో వాన కురుస్తోంది. కొన్నిచోట్ల భారీ వర్షం పడింది. అత్యధిక ప్రాంతాల్లో ఎడతెరిపిలేకుండా జల్లులు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఆదివారం ఉదయం వరకూ సుమారు 16మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఈ రెండు రోజుల్లో నాగులుప్పలపాడు, ఒంగోలు, సంతనూతలపాడు, మద్దిపాడు, పుల్లలచెరువు, చీమకుర్తి, టంగుటూరు. దోర్నాల, వైపాలెం, ముండ్లమూరు, కురిచేడు, గిద్దలూరు, కొమరోలు, వెలిగండ్ల, పీసీపల్లి తదితర మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం పగటిపూట కూడా జిల్లా అంతటా జల్లులు పడుతూనే ఉన్నాయి. ప్రత్యేకించి ఒంగోలు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో తెరపి లేకుండా చినుకులు పడుతుండగా సాయంత్రానికి కొన్ని చోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. ముసురుగా పడుతున్న వర్షం సాగుకు ఉపయుక్తమని రైతులు చెప్తున్నారు. ఇలా జల్లులు పడుతుండటం వల్ల భూమి బాగా నీరు తాగి పదునెక్కి. ఖరీఫ్ సాగుకు సానుకూలంగా మారనుంది. ఇప్పటికే వేసిన పైర్లు కోలుకోనున్నాయి.

పైరవీలకే పెద్దపీట?



చీమకుర్తి పోలీస్‌స్టేషన్

చీమకుర్తి సీఐగా సుబ్బారావు పేరు

గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఆయనకు ప్రాధాన్య సర్కిళ్లు

ఐదేళ్లుగా ఇబ్బందిపడిన వారికి ఇప్పుడూ మొండిచెయ్యి

రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పోలీసు శాఖలో పైరవీలకే పెద్దపీట వేస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఇబ్బంది పడిన వారి గురించి పట్టించుకోకుండా, అప్పట్లో పెత్తనం చేసిన వారికే మళ్లీ ప్రాధాన్యం ఇస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అందుకు జిల్లాలో చీమకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు అంశం నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నాయి. చీమకుర్తి సీఐ పోస్టును పలువురు ఆశించారు. అందులో ఎం.శ్రీనివాసరావు అనే సీఐ ఒకరు. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆయన్ను లూప్‌లైన్‌లోకి పంపారు. ఐదేళ్లపాటు అలాగే కొనసాగారు. అందులో కొన్ని మాసాలు వీఆర్‌లో ఉండి జీతాలు కూడా రాక ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన పేరు తెరపైకి వచ్చింది చీమకుర్తి సీఐగా ఆయన్ను నియమించాలని స్థానిక టీడీపీ నాయకులు, పోలీస్ శాఖలోని బాధిత ఉద్యోగులు సంబంధిత ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తోపాటు, జిల్లాకు చెందిన మంత్రి స్వామిని కోరారు. సీనియర్ నాయకుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కూడా శ్రీనివాసరావును చీమకుర్తి సీఐగా నియమించాలని సిఫార్సు లెటర్ ఇచ్చారు. అయితే అనూహ్యంగా పరిస్థితి తారుమారైంది. శ్రీనివాసరావును కాదని సుబ్బారావు అనే సీఐని చీమకుర్తికి నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు సంకేతం అందింది. దీంతో ఆయన బిత్తరపోయారు. లోకేష్ మామ అయిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సిఫార్సు మేరకే మీకు సమాచారం ఇచ్చామని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ఉన్నతాధికారులు సెలవిచ్చారు. దీంతో ఆయన ఇది తనస్థాయికి మించిన అంశమని స్థానిక నాయకులను పిలిచి చెప్పినట్లు తెలిసింది. విషయం తెలియగానే శ్రీనివాసరావుతోపాటు పోలీసు శాఖలో వైసీపీ బాధిత ఆఫీసర్లు అంతా గగ్గోలు పెట్టటం ప్రారంభించారు.

ఇంతకీ సుబ్బారావు ఎవరు?

తాజాగా వెలుగులోకి వచ్చిన సీఐ సుబ్బారావు ఎవరనేది చర్చనీయాంశమైంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆయన సీఐగా ఒక వెలుగు వెలిగారు. ప్రాధాన్యత గల అనేక సర్కిళ్లలో పనిచేశారు. ఎక్కువ కాలం అప్పటి మంత్రి విడదల రజని ప్రాతినిధ్యం వహించిన చిలకలూరిపేట రూరల్ సర్కిల్‌లో బాధ్యతలు నిర్వహించారు. పిడుగురాళ్ల, లాలాపేటతోపాటు ఇప్పుడు లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి టౌన్ సీఐగా పనిచేశారు. చివర్లో ఉమ్మడి జిల్లాలోని ఇంకొల్లు సీఐగా వచ్చిన ఆయన ప్రజల నాడిని గమనించి కొద్ది రోజుల్లోనే ఇంకొల్లు వదిలేసి వీఆర్‌కు వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన సీఐ సుబ్బారావు అప్పట్లో తన సామాజికవర్గాన్ని అడ్డంపెట్టుకొని తెలంగాణకు చెందిన కేటీఆర్ ద్వారా సిఫార్సులు చేయించుకున్నట్లు ప్రచారం జరిగింది. అదే సుబ్బారావు తాజాగా బాలకృష్ణ వ్యక్తిగత బృందంలో పనిచేస్తున్న సమీప బంధువు ద్వారా ఆయన మద్దతు పొందారని చెప్పుకొంటున్నారు. సీఐ సుబ్బారావు వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులకు వ్యతిరేకంగా పనిచేశారా? లేదా? అన్నది పక్కన పెడితే వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఇబ్బందులు పడిన సీఐకు వచ్చే అవకాశాన్ని దెబ్బతీయడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఎర్రగొండపాలెం సీఐగా మాతంగి శ్రీనివాసరావు పేరును అక్కడి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ప్రతిపాదించారు. వెంటనే మంత్రి లోకేష్ ఆఫీస్ ప్రతినిధులు ఫోన్ చేసి గత ప్రభుత్వంలో టీడీపీ ఎమ్మెల్యేలను సైతం ఆయన అవమానించారని, ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సూచించారు. దీంతో చీమకుర్తి సీఐ పోస్టింగ్ విషయంలో లోకేష్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశమైంది.

పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచుతా

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు

గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం

17న బాధ్యతల స్వీకరణ : నూతన ఎస్పీ దామోదర్



ఎస్పీ దామోదర్


ఒంగోలు (క్రైం), జూలై 14 : పోలీసు అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేసి శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతానని జిల్లాకు ఎస్పీగా నియమితులైన ఏఆర్ దామోదర్ తెలిపారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. గంజాయి, మత్తుపదార్థాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. సరఫరాదారులు, విక్రేతలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. సిబ్బంది సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇస్తానన్నారు. జిల్లా ప్రజలతో మంచి సంబంధాలున్నాయన్న ఆయన.. తన తొలిపోస్టింగ్ ఒంగోలులోనే ప్రొబేషనరీ డీఎస్పీగా ఆరు నెలలు పనిచేశానని గుర్తు చేశారు. 2021 నుంచి ఇప్పటి వరకూ ఒంగోలు పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈనెల 17న ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తానని దామోదర్ చెప్పారు.

ఆ ఇద్దరూ వెనక్కి తగ్గారు..!

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బూచేపల్లి పేరు పరిశీలన

ఒంగోలు కార్పొరేషన్‌పైనే అందరి దృష్టి

లోపలి పేజీల్లో...





ఒంగోలులో డ్రగ్స్ కలకలం

మెయిన్‌లో...

అపస్మారక స్థితిలోకి వెళ్లిన విద్యార్థి

చికిత్స చేయించినా పూర్తిగా కోలుకోని వైనం

సహచరులే కూల్‌డ్రింక్‌లో మత్తు పదార్థం కలిపి తాగించారని తల్లిదండ్రుల ఆరోపణ

పంచాయతీలకు పరిపుష్టి

తిరిగి వాటికి 15వ ఆర్థిక సంఘం నిధులు

నేడోరేపో ఖాతాల్లో రూ.40కోట్లు జమ

అడ్డగోలుగా హాంఫట్ చేసిన వైసీపీ ప్రభుత్వం

ఉత్సవవిగ్రహాలుగా పాలకవర్గాలు

పూర్వవైభవం తెచ్చేందుకు సీఎం చర్యలు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 14 : వైసీపీ పాలనలో ఐదేళ్లుగా నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చి పూర్వవైభవం తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకే ఇవ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో మంజూరై పంచాయతీలకు దక్కని 15వ ఆర్థిక సంఘం నాల్గో క్వార్టర్ నిధులను వెనక్కి ఇవ్వనుంది. ఈమేరకు వాటి ఖాతాలకు నేడోరేపో రూ.40 కోట్లు జమ చేయనుంది. ఈ నిధులతో గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా లాగేసుకుంది. పంచాయతీ ఖాతాలకు జమ చేసినట్లే చేసి ఆ వెంటనే హాంఫట్ చేసింది. దీంతో పైసా నిధులు లేక పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగా ఉండిపోయాయి.

పారిశుధ్యం, ఇతరత్రా పనులకు అవకాశం

ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల బారినపడకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు అత్యవసరమైన పనులు చేసే అవకాశం కలగనుంది. జిల్లాలో గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఎన్నికై మూడున్నర సంవత్సరాలైనప్పటికీ నిధుల లేమితో సర్పంచ్‌లు ఏ ఒక్క పని కూడా చేయలేకపోయారు. గొప్పకోసం కొంత మంది అప్పులు చేసి పలు అభివృద్ధి పనులు చేసినా బిల్లులు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ప్రోత్సహించేలా ఆర్థిక సంఘం నిధులు ఇస్తుండటంతో పాలక వర్గాల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

నాలుగో క్వార్టర్ నిధులు తిరిగి ఇవ్వాలని సీఎం నిర్ణయం

రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆశాఖపై సమీక్షలు నిర్వహించారు. అనేక లోటుపాట్లను గుర్తించారు. గ్రామ పంచాయతీల్లో ఏపని చేపట్టాలన్నా ఒక్క రూపాయి కూడా లేదన్న విషయాన్ని గుర్తించిన ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పంచాయతీలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా అడుగులు వేశారు. గత ప్రభుత్వంలో హాంఫట్ చేసిన వాటిలో 15వ ఆర్థిక సంఘం నాలుగో విడత నిధులను తిరిగి ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు జిల్లాలోని 730 పంచాయతీల ఖాతాల్లో రూ.40కోట్లు జమకానున్నాయి.



పేదల ఆకలి తీర్చటం అభినందనీయం

● ఎమ్మెల్యే దామచర్ల



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జూలై 14: నిత్యం దాదాపు 300 మంది అనాథలు, పేదల ఆకలి తీర్చటం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని శివం ఫౌండేషన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి అందిస్తున్న సామాజిక సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. పేదల ఆకలి తీర్చటానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. శివం శరణాలయం శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ శివం శరణాలయం ద్వారా అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న శివం ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, కోసూరి శ్రీదేవి, మండవ సుబ్బారావు, వడ్డెంపూడి సుజాత, చిక్కాల కిరణ్‌కుమార్, డి.శ్రీనివాస్, బాస్కర్‌రావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పిల్లలకు ప్రోత్సాహకాల అందజేత

ఒంగోలు(క్రైం), జూలై 14: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంపిక చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పోలీసు కళ్యాణమండపంలో పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారి పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 127 మంది పిల్లలకు ఎస్పీ చేతులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పోలీసు కుటుంబాలలో పిల్లలు ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధిచడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వ్యక్తిత్వ నిపుణులు వెల్‌విషర్ శంకర్ నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏవో ఎం.సులోచన, ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్రరావు, బీమానాయక్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతులు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 14: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని లార్డ్‌కృష్ణ షటిల్ అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీగా తలపడగా, పలువురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-11, 13, 15, 17, 19 విభాగంలో బాల, బాలికలు తలపడ్డారు. వారిలో ఎస్‌కే.ఆఫ్రాన్‌కుషాల్, ఆన్యందన్, ఎస్‌కే.రబియా, ఇషిత, ఆరాధ్య, స్కంధ, జి.షణ్ముఖ, శ్రేయాష్, అక్షాజ్, ఎస్‌కే.ఆఫ్యాన్, ఆశశ్రీ, అనుప్‌నాయక్, జి.విమల్, వై.వినయ్, మనస్వి, ఆషాశ్రీ, మౌనిక, త్రిభువన్, తారక్‌రామ్‌చరణ్, వెంకటసాయి వర్షిత్, అభిలాష్, రిషి, కె.సరియా, నితిక, శ్రీజ, శ్రీధర్‌రెడ్డి, సూర్యకిరణ్, పి.సుమంత్, శశిధర్, అనుశ్రీ, సౌమ్య, మౌనిక, నందిని, డి.వసంతరావు, ఎస్‌కే.కలాం, వైష్ణవిలు విన్నర్, రన్నర్‌లుగా నిలిచారు. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఎంపికైన వారు త్వరలోనే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, లక్ష్మణ్‌రెడ్డి, విజయ్, రవిబాబు, రఘు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహితంగా
పాఠశాలలను తీర్చిదిద్దాలి

● సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య), జూలై 14: పాఠశాలలను పొగాకు రహిత విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొగాకు తాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల విద్యార్థులు, యువత నిర్వీర్యమై పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో నిర్వహించిన గ్లోబల్ యూత్ టుబాకో సర్వే 2019లో 13నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలు 8.5శాతం మంది పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు తేలింది. మరో సర్వే గ్లోబల్ అడల్ట్ టుబాకో సర్వేలో 20 ఏళ్లలోపు యువకులు 55శాతం మంది పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. యువత పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావడంతో వారిలో అభ్యసన స్థాయిలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ యువత పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భాగంగా ముందుగా పాఠశాలలను పొగాకు రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పాఠశాలల్లో పొగాకు నిషేధిత ప్రాంతాలుగా బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్కూళ్ల ముఖద్వారాలు, సరిహద్దుగోడల వద్ద పొగాకు నిషేధిత విద్యాసంస్థ బోర్డులు పెట్టాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. జిల్లాలో ఈ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేసేందుకు డీఈవోను నోడల్ అధికారిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి పాఠశాలను పొగాకురహిత స్కూళ్లలో తీర్చిదిద్దాలని డీఈవోలను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మద్దిపాడు, జూలై 14: గుండ్లాపల్లి ఫ్లైఓవర్ దగ్గర ఆదివారం మోటార్ సైకిల్ అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యారు. మార్టూరు నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్‌సైకిల్ కారును అధిగమించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో మార్టూరుకు చెందిన గోపాలకృష్ణ, కిరణ్‌కుమార్, ఆదిత్యకుమాలకు స్వల్ప గాయాలు కాగా వైద్యం కోసం ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

నలుగురికి స్వల్పగాయాలు

పెద్ద దోర్నాల, జూలై 14: అదుపు తప్పిన ప్రైవేటు బస్సు చెట్టును ఢీ కొట్టిన ఘటన ఐనముక్కల ఆర్‌సీఎం చర్చి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రైవేటు బస్సు యాత్రికులతో శ్రీశైలం వెళ్లి దైవ దర్శనానంతరం తిరిగి వెళుతోంది. ఈ క్రమంలో చర్చి దాటగానే స్పీడు బ్రేకర్స్‌ను దాటించే సమయంలో బ్రేకులు పడలేదు. దీంతో అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనను గమనించిన పలువురు 108 నంబరుకు ఫోన్ చేసి అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. క్షతగాత్రులను దోర్నాల వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. ప్రమాద సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పలువురిపై కేసు నమోదు

పొదిలి, జూలై 14: పొదిలి పట్టణంలోని టైలర్స్‌కాలనీలో టీడీపీ, వైసీపీ కార్యకర్తలకు జరిగిన ఘర్షణలో టీడీపీకి చెందిన కార్యకర్త జాకీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైసీపీ మాజీ పట్టణాధ్యక్షుడు రబ్బాని ఆయన అనుచరులు కాలనీలో డిప్‌బోరు విషయంలో టీడీపీ కార్యకర్తలతో ఘర్షణ పడ్డారు. ఈ వివాదం కొట్లాలకు దారి తీసింది. దీంతో జాకీర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాధితుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. జాకీర్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

ఆ ఇద్దరూ వెనక్కి తగ్గారు..!

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బూచేపల్లి పేరు పరిశీలన

ఒంగోలు కార్పొరేషన్‌పైనే అందరి దృష్టి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ అధినేత జగన్, జిల్లాలో ఆపార్టీ కీలక నేత బాలినేని శ్రీనివాసరెడ్డి ఇద్దరూ కాస్తంత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తదగుణంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా స్థానికుడినే నియమించేందుకు పరిశీలన ప్రారంభించారు. అయితే ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీకి గుడ్‌బై చెప్పే కార్పొరేటర్ల అంశం ఇంకా కొలిక్కిరాలేదు. సోమవారం ఒంగోలు రానున్న మాజీ మంత్రి బాలినేని చెప్పే మాటలను కొందరు కార్పొరేటర్లు గౌరవిస్తారా? లేకా టీడీపీ గూటికి చేరతారా? అన్నది తేలాల్సి ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించాలనుకోవడం, దానిని బాలినేని తీవ్రంగా వ్యతిరేకించడం, ఆపై బాలినేనితో సజ్జల రామకృష్ణారెడ్డి మంతనాలు జరపడం తెలిసిందే. అందిన సమాచారం మేరకు చెవిరెడ్డిని నియమించే విషయంలో పునరాలోచనకు జగన్ ఓకే అన్నట్లు తెలిసింది. అదేసమయంలో జిల్లాలో ఎవరికి అధ్యక్ష పదవి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని బాలినేని చెప్పినట్లు సమాచారం. దీంతో జగన్ కూడా కాస్తంత వెనక్కి తగ్గి చెవిరెడ్డి నియామకాన్ని తాత్కాలికంగా ఆపాలని చెప్పినట్లు తెలిసింది. అయితే పార్టీ అధ్యక్ష పదవి జిల్లాలో ఎవరికి ఇవ్వాలన్న అంశంపై తర్జనభర్జనలు ఆరంభమయ్యాయి. అందులో భాగంగా దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి పేరును ప్రధానంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని కొనసాగించాలన్న ఆలోచన ఉన్నప్పటికీ బూచేపల్లి అయితే ఇటు ఆయన ఎమ్మెల్యేగా, ఆయన తల్లి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నందున ఎక్కువ ఉపయోగం ఉంటుందన్న ఆలోచనతో ఆవైపు అధిష్ఠానం దృష్టి సారించింది.

ఒంగోలు కార్పొరేషన్‌పై సర్వత్రా చర్చ

ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్ల పార్టీ మార్పు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేనకు చెందిన ఏడుగురితోపాటు వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లతో కార్పొరేషన్‌లో టీడీపీ బలం 13కు చేరింది. మరో 13 మంది టీడీపీలోకి జంప్ చేస్తే వైసీపీ పట్టు కోల్పోతుంది. మేయర్ సుజాతను పక్కనబెట్టి కొందరు కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకునేందుకు ఆపార్టీ సిద్ధమైంది. ఈనేపథ్యంలో తాను ఒంగోలు వచ్చి మాట్లాడతానని, అప్పటిదాకా ఆగాలని బాలినేని వైసీపీ కార్పొరేటర్లకు సూచించారు. దీంతో ఆదివారం టీడీపీలో చేరేందుకు సిద్ధమైన వైసీపీ కార్పొరేటర్లు పలువురు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. బాలినేని చెప్పాల్సిన అంశాలన్నీ చెప్పి సోమవారం రాత్రికే తిరిగి హైదరాబాద్ వెళతారని తెలిసింది. కొద్దిరోజులు కుటుంబంతో కలిసి విదేశాల్లో ఉన్న తన చెల్లి వద్దకు ఆయన వెళ్లనున్నట్లు తెలిసింది. ఆతర్వాత వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలోకి జంప్ అవుతారా? లేక సోమవారం బాలినేనితో చర్చించిన అనంతరం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారా? అనేది చూడాల్సి ఉంది.

అన్న క్యాంటీన్లకు ఆర్థికసాయం !

● దాతలకు ఎమ్మెల్యే దామచర్ల అభినందన



ఎమ్మెల్యే దామచర్లకు నగదును అందజేస్తున్న ఎస్ఐ బాబురావు



జనార్దన్‌కు నగదును అందజేస్తున్న ఎస్‌బీఎంసీ కమిటీ సభ్యులు

ఒంగోలు(క్రైం), జూలై 14: ఒంగోలు నగరంలో పేదల ఆకలి తీరుస్తున్న అన్నక్యాంటీన్ల నిర్వహణ కోసం పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించ లేదు. అయినా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంలో నగరంలోని అన్నక్యాంటీన్లను పేదల కోసం పునఃప్రారంభించారు. ఇందుకోసం చేదోడుగా నగరంలోని పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందజేస్తూ అన్నదానానికి అండగా నిలుస్తున్నారు.

ఎస్ఐ దాతృత్వం

సమాజ సేవ కోసం నేను సైతం అంటూ ఎస్ఐ బత్తుల బాబురావు ముందుకు వచ్చారు. అన్న కాంటీన్‌లో అన్నదానం చేసేందుకు రూ.50 వేల నగదును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బాబురావు నగరంలోని అన్నకాంటీన్లలో జరుగుతున్న అన్నదానం గమనించారు. దీంతో తాను కూడ పేద ప్రజలకు సహకారం అందిచాలని భావించారు. ఒంగోలులో నాలుగు ప్రాంతాలలో అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దామచర్లకు తనవంతుగా విరాళంను ఎస్ఐ అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు భోజనం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. ఎస్ఐ బాబురావును పలువురు ప్రశంసించారు.

ఎస్‌బీఎంసీ కమిటీ ఆధ్వర్యంలో..

ఒంగోలు(కార్పొరేషన్): ఒంగోలులో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా అందిస్తున్న ఆహారం కోసం ఎస్‌బీఎంసీ కమిటీ చేయూతనిచ్చింది. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో త్వరలో అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించడం ఎంతో సంతోషంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల కమిటీ సభ్యులను, కాంప్లెక్స్ వ్యాపారులను అభినందించారు.

జీపీఎస్ గజిట్‌ను వెంటనే రద్దు చేయాలి

● బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 14: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలుకు ఇచ్చిన గజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవోనెంబరు 117ను రద్దు చేసి తద్వారా ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.జాలరామ్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కర్రి దేవసహాయం, పల్లె కృష్ణమూర్తి, చెక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపట్నం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడుగా కె.జోసఫ్, గౌరవ సలహాదారులుగా చిటితోటి రామకృష్ణారావు, అధ్యక్షులుగా నన్నేసాని భాస్కర్, ప్రధానకార్యదర్శిగా అల్లరి విజయ్, కార్యనిర్వహక అధ్యక్షులుగా షేక్ ఫయాజ్, ఉపాధ్యక్షులుగా వెలిచర్ల రాజేష్, కార్యదర్శులుగా మిడసల కళ్యాణి, దాసరి శిరీష, గిరి, జిల్లా కౌన్సిలర్లుగా యాదల రూతమ్మ, జి.నగేష్, మహిళా కార్యదర్శులుగా దార్ల దానమ్మ, తెలగతోటి సంధ్యారాణి, మన్నం వసుందర, కొల్లం వినోలియా, కొత్తపల్లి శారత, సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి : ఏపీటీఎఫ్

ఒంగోలు(విద్య): గ్యారంటీడ్ పెన్షన్ స్కీం(జీపీఎస్) అమలుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తే గత ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని ప్రతిపాదించిందన్నారు. తాము ఈ విధానాన్ని కూడా ఆమోదించేది లేదని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్ విధానాన్ని ఆమోదిస్తూ గజిట్ నోటిఫికేషన్‌ను ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఈ గజిట్‌ను ఉపసంహరించుకొని ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి కేవీజీకీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు డిమాండ్ చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుంచి తాగునీరు అందించాలి

ఎమ్మెల్యే బీఎన్‌కు ఇనమనమెళ్లూరు గ్రామస్థుల విజ్ఞప్తి



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు,జూలై 14: గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ఉంచి తమ గ్రామానికి మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని ఇనమనమెళ్లూరు గ్రామస్థులు కోరారు. ఆదివారం గ్రామంలో ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పర్యటించగా స్థానికులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఇనమనమెళ్లూరు గ్రామానికి ఆర్టీసీ బస్సులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణం, ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ముల్లూరి మురళి, పాటిబండ్ల అజయ్‌బాబు, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపి, గంగవరపు జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర అభినందనీయం

తన గెలుపు సందర్భంగా పాదయాత్ర నిర్వహించటం అభినందనీయమని, తనపై చూపిన అభిమానాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఇనమనమెళ్లూరు ఆంజనేయస్వామి విగ్రహం నుంచి శింగరకొండ వరకు టీడీపీ నాయకులు డొప్ప శేషయ్య చేపట్టిన పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విజయానికి కృషిచేసిన కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటానని, వారికి తగు న్యాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండవ గోపీనాథ్, నైనాల భావన్నారాయణ, మందపల్లి శ్రీనివాసరావు, పాటిబండ్ల అజయ్ బాబు, దేవబత్తిన ప్రసాద్, నైనాల మురళీకృష్ణ, మాదాసు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేర్రాజు



మహాసభలో మాట్లాడుతున్న ఫణి పేర్రాజు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 14: కోఆపరేటివ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశపుహాలు ఆదివారం అసోసియేషన్ మహాసభకు జిల్లా అధ్యక్షుడు బీసీ.మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పేర్రాజు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ విధుల నుంచి సహకార శాఖ ఉద్యోగులను విముక్తులను చేసినందుకు ఆశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకారశాఖలో డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేసి శాఖ నైపుణ్యతను కాపాడటంతో పాటు ఉద్యోగోన్నతులు ఇచ్చిన ఉద్యోగులకు విధిగా శిక్షణ ఇచ్చిన తర్వాతనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. ఆడిట్‌లో చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగులకు అసోసియేషన్ సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్‌నాయుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుల వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ కనకదుర్గారెడ్డి, జిల్లా సెక్రటరీ డి.థామస్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటరావు



వెంకటరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 14: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగొర్ల వెంకటరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు మండల పరిషత్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న వెంకట్రావును నియమించారు. జిల్లాలో, రాష్ట్రంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకట్రావు తెలిపారు.

ఫిర్యాదు చేసిన మహిళపై దాడి

మద్దిపాడు, జూలై 14: ఆవు తోకను కత్తిరించారని ఫిర్యాదు చేసిన మహిళపై అదే కాలనీకి చెందిన మహిళలు దాడి చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి ఇనమనమెళ్లూరులో చోటు చేసుకుంది. తన ఆవు తోకను కత్తిరించారని గ్రామంలోని ఎంపీసీనగర్‌కు చెందిన మహిళ మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తమపై ఫిర్యాదు చేసిందనే కోపంతో ఆ మహిళపై ఆ కాలనీకి చెందిన పలువురు మహిళలు దాడి చేశారు. దీంతో బాధితురాలికి గాయాలు కాగా మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణం



ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), జూలై 14: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక మౌర్య కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024-25వ సంవత్సరానికి అధ్యక్షునిగా చలువాది శ్రీహరి, సెక్రటరీగా పబ్బిశెట్టి రాజేష్, కోశాధికారిగా సీహెచ్.కుమార్‌స్వామిలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఆత్మీయ అతిథిగా హాజరైన శిద్దా హనుమంతరావు, కీనోట్ స్పీకర్‌గా కె.విజయ్‌చంద్, ఇన్‌స్టాలేషన్ అధికారిగా పి.విజయ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొనగా గవర్నర్ సీహెచ్.హరిప్రసాదరావు నూతన సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు, పూర్వ అధ్యక్షుడు వి.శ్రీరాములురెడ్డి, కార్యదర్శి ఎస్.నోబుల్ చెరియన్, కోశాధికారి అడపాల వెంకటేశ్వర్లు, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగాలి



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

ఒంగోలు(కల్చరల్), జూలై 14: విద్యార్థుల్లో పుస్తకాల పఠనం పట్ల ఆసక్తి పెరగాలని, అందుకోసం జిల్లా గ్రంథాలయ సంస్థ వివిధ కార్యక్రమాలు చేపడుతుందని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులో దేశ నాయకుల జీవిత చరిత్రలు, కథలు చదివించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, పి.ఇమ్మానుయేలు, ఎస్.అనిల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జూలై 14: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం హనుమత్ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. దేవస్థాన పాలకమండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇక సోమవారం జరిగే అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధన ఉత్సవాలలో భాగంగా ప్రముఖ హనుమత్ ఉపాసకులు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులుచే సుందరకాండ పారాయణ ఉంటుందని పాలకమండలి ప్రతినిధులు తెలిపారు.


ఎస్ఎస్‌సీ, రైల్వే ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 14: ఒంగోలులోని లాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా పదో తరగతి అర్హతతో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ హల్దావర్, డిగ్రీ అర్హతతో కంబైండ్ గ్రాడ్యుయేషన్ లెవెల్ ఉద్యోగాలకు, అలాగే రైల్వే శాఖలో ఏఎల్‌పీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనందున జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిలకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపు అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు స్థానిక అంజయ్యరోడ్‌లోని లాజిక్ అకాడమలో నేరుగా గాని, లేదా సెల్ : 7207012758 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

మద్దిపాడులో వాహనాల తనిఖీ

మద్దిపాడు, జూలై 14: మండలంలోని మద్దిపాడు, వెల్లంపల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించి ఎస్సై మహేష్ కౌన్సిలింగ్ చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నిబంధనలను పాటించాలని, వాహనాలు అతివేగంగా నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన చెప్పారు.


పచ్చదనం పెంపొందించడం అభినందనీయం



మొక్కలను అందిస్తున్న రామకృష్ణ

నాగులుప్పలపాడు, జూలై 14: పచ్చదనం పెంపొందించడం అభినందనీయమని సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరుకు చెందిన కనగాల రామకృష్ణ తన సొంత నిధులతో గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డుకిరువైపులా 150 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కనగాల రామకృష్ణ మాట్లాడుతూ గతంలో రోడ్డుకిరువైపులా ప్రాణాంతక కోనోకార్పస్ చెట్లు ఉండి ప్రజల ఆరోగ్యానికి అవి హానికరంగా మారాయని, వాటిని తొలగించి వివిధ రకాల పండ్ల మొక్కలు, నీడనిచ్చే, ఆరోగ్యకరమైన మొక్కలను కొనుగోలు చేసి నాటుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కనగాల కమలనాథం, తెలగతోటి శామ్యూల్, ఉన్నం వెంకటరావు, శివ, నల్లూరి మోహనరావు, గుడివాడ బ్రహ్మయ్య, కండ్లగుంట సాయి, గోగినేని హరిబాబు, కొప్పర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), జూలై 14: పద్మ మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సంస్థ 13వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షురాలు పి.పద్మ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 25 మంది గాయకులు పాల్గొని సినీపాటలను శ్రావ్యంగా ఆలపించారు. గుర్రం కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో గాయకులు పి.శ్రావ్యరెడ్డి, సింధు, శైలజ, లక్ష్మీప్రియ, ఉషారాణి, హరిబాబు, కోటేశ్వరరావు, జి.శివప్రసాద్, సాయిమాస్టర్, శ్రీనివాసరెడ్డి, మా మూర్తి, జనార్దన్, కుంబా రాఘవయ్య, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, అధికారులు

పొదిలిరోడ్డులో ఆక్రమణల తొలగింపు

● మంత్రి ఆదేశాలతో కదలిక

● దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

● పనులను పరిశీలించిన స్వామి

కొండపి, జూలై 14 : కొండపి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఆక్రమించి పూడ్చివేసిన కాల్వల వెలికితీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. వెంటనే కాలువలను వెలికి తీయాలని, దుకాణాల వారు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకునేలా వారికి చెప్పాలని శనివారం మంత్రి స్వామి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వారు వెంటనే దుకాణాల వారికి చెప్పి, ఆదివారం ఉదయం నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మెరకలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించే కార్యక్రమాన్ని డీఈ దాసరి మాధవరావు దగ్గరుండి ప్రారంభించారు. ఆదివారం ఉదయం మర్రిపూడి మండలంలోని వేమవరంలో కార్యక్రమానికి వెళుతూ తిరిగి పనులను పరిశీలించారు. కాలువల వెలికితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మురుగు నీరు నిల్వలేకుండా చేయడమే ధ్యేయంగా మంత్రి కృషి చేస్తున్నారు. మంత్రి ఆదేశాలతో పనులు సత్వరమే జరుగుతుండటంతో స్థానికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండపి ప్రాంతంలో తేలికపాటి వర్షం

కొండపి, జూలై 14 : కొండపి ప్రాంతంలో గడిచిన రెండు రోజుల నుంచి తేలికపాటి వర్షం కురుస్తున్నది. ఆదివారం కూడా ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది. ప్రస్తుతం రైతుల పొలాల్లో నువ్వు, పచిరొట్ట పైర్లు వేసి ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఈ పైర్లకు మేలు చేస్తుందని రైతులు అంటున్నారు. వర్షం భారీగా పడితే ఎర్రనేలల్లోని రైతులు కంది, మేతజొన్న పంటలు వేస్తారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

మానవసేవ పరమాత్ముని సేవగా భావించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 14: మానవసేవ పరమాత్ముని సేవగా ప్రతిఒక్కరూ భావించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ రోడ్డులోని పిరమిడ్ యోగా మందిర్‌లో మానవతా శాఖ నూతన కార్యకర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలో మానవతా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పరులకు సేవ చేయటం కర్తవ్యంగా భావిస్తూ ఎంతోమంది పేదలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను తీరుస్తున్న మానవతాసంస్థ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. సమాజంలో మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాల క్రమంలో ఇలాంటి సంస్థలు అందిస్తున్న సేవలు మనుషుల సత్సంబంధాలు పెంపొందుతాయన్నారు. ప్రతిఒక్కరూ మానవతా సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.

సమావేశంలో కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), మానవతాసంస్థ నాయకులు సొమిశెట్టి శ్రీనివాసులు, గుత్తి శ్రీధర్, పసుపలేటి అరుణోదర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మాంటిస్సోరి పిచ్చిరెడ్డి, తానిగుండాల శ్రీనివాసరెడ్డి, పసుపులేటి వాణి, తదితరులు పాల్గొన్నారు.



అంబవరం ఉన్నత పాఠశాల

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

● అంబవరం జడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 220 మంది విద్యార్థులు

● 12 మందికి నలుగురే విద్యాబోధన

సీఎస్‌పురం(పామూరు), జూలై 14: సీఎస్‌పురం మండలం అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సబ్జెక్ట్ టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు సీఎస్‌పురం మండలంలో విద్యపరంగా అంబవరం పాఠశాలకు ఘన చరిత్ర ఉంది. నేడు ఉపాధ్యాయుల కొరతతో కునారిల్లుతుంది. ఈపాఠశాలలో 12 మంది ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడుతో కలిసి నలుగురు ఉపాధ్యాయులే విద్యాబోధన చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 220 విద్యార్థులు ఉన్నారు. ఆరో తరగతిలో 45 మంది, 7లో 35 మంది, 8లో 50 మంది, 9లో 40 మంది, పదో తరగతిలో 45 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇంగ్లీష్, లెక్కల సబ్జెక్టుల్లో రెండేసి పోస్టులు, సామాన్యశాస్త్రం, సోషల్, పీఈటీ, హిందీ సబ్జెక్టులో ఒక్కో పోస్టు ఖాళీగా ఉంది. బయాలజీ, పీఈటీ పోస్టులు గత నాలుగు సంవత్సరాలుగా భర్తి చేయలేదు. 1962లో జిల్లాపరిషత్ ఉన్న త పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశాక, ఇంతమంది ఉపాధ్యాయుల కొరత ఎన్న డూలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది ఈ పాఠశాలలోనే 3,4,5 తరగతులను విలీనం చేశారు. 20 మంది విద్యార్థులు ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిఉండగా కనీసం ఒక్కరు కూడా లేకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

పీసీపల్లి, జూలై 14: తాగునీరు సరఫరాచేసే మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం పంచాయతీల్లోని గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో కలిసి మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. తాగునీరు కలుషితమైతే డయేరియా ప్రబలే ప్రమాదముందన్నారు. మంచినీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేసుకుంటూ శుభ్రంగా ఉంచాలని సర్పంచ్‌లను ఆదేశించారు. సర్పంచ్ కనపర్తి శాంసన్, ఉపసర్పంచ్ కుందూరు కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన తిరునాళ్ల

పామూరు, జూలై 14: పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధిలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థాన తిరునాళ్ల ఈనెల 17 వరకు జరుగుతున్నాయి. తొలిరోజు ఆదివారం గణపతి పూజ, అభిషేకాలు, సుదర్శన హోమాలు నిర్వహించారు. సాయంత్రం నవగ్రహ అష్టదిక్పాలక హోమాలు, మహానైవేద్యం భక్తులకు సమర్పించారు.

రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం

● మంత్రి స్వామి

మర్రిపూడి, జూలై 14 : రాష్ట్ర సమగ్రాభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఆదివారం మండలంలోని భీమవరం అంకమ్మ దేవాలయంలో టీడీపీ కార్యకర్తలు ఎన్నికల సందర్భంగా మొక్కిన మొక్కుబడులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రితోపాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాడి తప్పిన పరిపాలనను చక్కదిద్దడమే కూటమి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అని చెప్పారు. వివిధ శాఖలలో జరిగిన అవినీతిని వెలికి తీసి శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం విజయానికి అవిరళ కృషి చేసిన కార్యకర్తల త్యాగాన్ని మరువలేమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పలు సిమెంట్ రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. అదే విధంగా టంగుటూరు-పొదిలి రహదారిలో గీతాంజలీ స్కూల్ నుంచి రేగలగడ్డ బస్టాండ్ వరకు ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదభరితంగా మారిందని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జువ్విగుంట, ఉప్పలపాడు పంచాయతీ రాజ్ రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేయాలని వారు కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవడం ద్వారా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని చెప్పారు. ఇసుక పంపిణీపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. తొలిసారిగా గ్రామానికి వచ్చిన మంత్రికి టీడీపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, నేతలు రేగుల వీరనారాయణ, రేగుల శ్రీనివాసరావు, దాసరి వెంకటేశ్వర్లు, డాక్టర్ స్వర్ణ గీత, తుళ్లూరు నరసింహారావు, గుదే శ్రీనివాసులు, జాగర్లమూడి రామారావు, గుదే వెంకటేశ్వర్లు, బొల్లా వెంకటేశ్వర్లు, వై వెంకటరెడ్డి, సీహెచ్ కొండారెడ్డి, నేరెళ్ల ఏడుకొండలు, లెక్కల భాస్కర్, సిద్ధయ్య, కిలారి ఆంజనేయులు, కే మోహనరావు, రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



వేమవరం అంకమ్మ దేవాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న మంత్రి స్వామి, దామచర్ల సత్యలు

నేతన్నల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

» ఎమ్మెల్యే కొండయ్య

» ఘనంగా సన్మానించిన మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



ఎమ్మెల్యే కొండయ్యకు వినతిని ఇస్తున్న మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ ప్రతినిధులు

చీరాల, జూలై 14 : సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో చేనేత రంగానికి సంబంధించి మాస్టర్ వీవర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు, చేనేత, జౌళి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండల పరిధిలోని జాండ్రపేటలో ఆదివారం దేవాంగ కల్యాణ మండపంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండయ్యను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నేతన్నలకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు పలువురు మాస్టర్ వీవర్లు నియోజవకర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన వస్త్రాల నిల్వలు కొనుగోళ్లు జరగక పేరుకు పోయాయని వివరించారు. ఆ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కొండయ్య వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిద్ధి బుచ్చేశ్వరరావు, గుంటి ఆంజనేయులు, బట్ట శ్రీను, గుంటి వెంకయ్య, బట్ట సురేష్, పసుమర్తి మల్లికార్జున, బి. భాస్కర్, వి.రాజ, సజ్జా లెనిన్, బట్ట రాంబాబు, సుబ్రమణ్యం, ప్రసాద్, హరికృష్ణ, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ

తెల్లగాంధీ బొమ్మ సమీపంలోని భావనారుషి స్వామి వారి ఆలయంలో ఆదివారం పద్మశాలీయ బహుత్తమ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను కొండయ్య అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడిలో పూజలు

మండల పరిధిలోని తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి గుడి వద్ద ఆదివారం నిర్వహించిన కొలుపులు కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కొండయ్య అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సహజ వనరులను దోచుకున్నవారు నీతులు చెప్పడం విడ్డూరం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం



దర్శి, జూలై 14: వైసీపీ నాయకులు చెబుతున్న మాటలు, నీతి వాఖ్యాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదలచేశారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజాధనాన్ని, సహజ వనరులను దోచుకున్న నాయకులు ఇప్పుడు నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి నెల రోజులు మాత్రమే గడిచినప్పటికీ అప్పుడే హామీలు అమలు చేయలేదని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించటం శోచనీయమన్నారు. తల్లికి వందనం పథకం అమలుకు విధివిధానాలు రూపొందిస్తుండగా, అప్పుడే ఒక బిడ్డకు మాత్రమే ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేయటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిప్పర్ ఇసుక ఎంతకు విక్రయించారో కనిపించలేదా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇసుక ఉచితంగా ఇస్తున్నట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. టిప్పర్ ఇసుకకు ఇప్పుడు రూ.7వేలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టిప్పర్‌కు రూ.30 వేలు తీసుకున్న విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేస్తున్న విమర్శలు చూసి దర్శి నియోజకవర్గ ప్రజలు చీదరించుకుంటున్నారని, ఆయన్ను ఎందుకు గెలిపించుకున్నామా అని ఇప్పుడు బాధపడుతున్నారని విమర్శించారు. దర్శి నియోజక వర్గంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా చైర్‌పర్సన్ పదవిని అడ్డంపెట్టుకొని వైసీపీ కార్యకర్తలకు అడ్డగోలుగా నిధులు దోచిపెట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా 90 శాతం మట్టి పనులు కేటాయించి వైసీపీ కార్యకర్తలకు దోచిపెట్టారని విమర్శించారు. జిల్లా పరిషత్‌లో అడ్డగోలుగా పనుల కేటాయింపు, అనేక చోట్ల తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కరోజులో పింఛన్లు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అమరావతి నిర్మాణానికి శరవేగంతో తీసుకుంటున్న నిర్ణయాలు కనపడలేదా అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పాలన పట్ల అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుండగా, వైసీపీ నాయకులకు దిక్కుతోచక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రజలు ఉన్న సీట్లు కూడా లేకుండా చేస్తారని డాక్టర్ లక్ష్మి స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చొరవచూపాలి

» ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

దర్శి, జూలై 14: నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. దర్శిలో జరుగుతున్న ఏపీటీఎఫ్ జిల్లాస్థాయి ఉద్యమ, అధ్యయన తరగతుల్లో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉద్యమాల ద్వారా ఎన్నో సమస్యలను సాధించుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఎల్లప్పుడూ పోరాటంలో ముందంజలో ఉంటుందన్నారు. 1947 నుంచి ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత సంఘానికి దక్కుతుందన్నారు. ఏపీటీఎఫ్ పోరాటం ద్వారానే టైంస్కేలు, ట్రిబుల్ బెనిఫిట్ స్కీమ్ సాధించినట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబించిందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, వరప్రసాదరావు, గురునాదశర్మ, బెజవాడ రఘుబాబు, డి.శ్రీనివాసులు, ఐ.విజయసారథి, నాయబ్‌రసూల్, హనుమంతరావు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం

» పట్టించుకోని పాలకులు

» పాడయిన వస్తువులు

» పూర్వవైభవం తీసుకురావాలని కూటమి ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి



ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ఎస్‌ఏపీ అతిథి గృహం

దర్శి, జూలై 14: దర్శి పట్టణ సమీపంలోని ఎస్‌ఏపీ రక్షణ మంచినీటి చెరువు వద్ద నిర్మించిన అతిథి గృహం ఏళ్ల తరబడి మూలనపడింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన అతిథి గృహం నిర్వాహణలోపంతో నిరుపయోగంగా మారింది. 1980లో నెథర్లాండ్ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. ఆ పథకాన్ని పరిశీలించేందుకు ఆ దేశ ప్రతినిధులు వస్తుంటారనే ఉద్దేశంతో చెరువు పక్కనే అతిథి గృహం నిర్మించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆ పథకాన్ని ప్రారంభించారు. ఆసందర్భంగా నెథర్లాండ్ దేశానికి చెందిన అతిథులు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొని ఇందులో విడిది చేశారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు దర్శికి ఎవరొచ్చినా ఇక్కడ ఉండేవారు. అతిథి గృహానికి ఇరువైపులా కొండలు, మధ్యలో ఎస్‌ఏపీ చెరువు, మరోవైపు పచ్చని పొలాలతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది.

కాలక్రమంలో ఎస్‌ఏపీ స్కీమ్ నిర్వాహణకు కూడా ప్రభుత్వాలు సక్రమంగా నిధులు ఇవ్వటంలేదు. గత వైసీపీ ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఫిల్టర్‌బెడ్లు పూర్తిగా చెడిపోవటంతో రా వాటర్ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో అతిథి గృహం కూడా మూతపడింది. లోపల విలువైన సామాన్లు కాలం చెల్లిపోవటంతో చెడిపోయాయి. ఆతర్వాత అభివృద్ధి పనుల గురించి పట్టించుకోకపోవటంతో తలుపులు, కిటికీలు, ఇతర సామాన్లు దెబ్బతిన్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎన్టీఆర్ ప్రారంభించిన అతిథి గృహాన్ని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పెట్లూరులోని సహజానంద స్వామి ఆలయం

నేటి నుంచి పెట్లూరు సహజానంద స్వామి ఆరాధన మహోత్సవాలు

కొండపి, జూలై 14 : మండలంలోని సహజానంద భారతీస్వామి 31వ మహాసమాధి ఆరాధనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పెట్లూరు గ్రామంలో ఏటా తొలి ఏకాదశి రోజున ప్రధానమైన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా తొలి ఏకాదశి రోజున ఆలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన కోటిరెడ్డి అనే భక్తుడు ఆధ్యాత్మిక చింతనలో గడిపి తొలి ఏకాదశి రోజున పరమపదించారు. ఆయన సమాధిని గ్రామంలో ఏర్పాటు చేసి గ్రామస్థులు, బంధువులు తొలి ఏకాదశి రోజున ఏటా పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇప్పటికే ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూలై 14: జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు.ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా సాగుతున్న అన్నదాన సత్రం పనులు

తాళ్లూరు, జూలై 14: పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమవరప్పాడు పరిధిలోని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. గంగాభవానీ ఆలయకమిటీ అధ్యక్షుడు కొసనా గురుబ్రహ్మం దేవాలయ నిధులకు తోడు దాతల సహకారంతో నిధులు సమకూర్చి దాదాపు రూ40లక్షల అంచనాలతో అన్నదాన సత్రం నిర్మిస్తున్నారు. గంగమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు దాతల సహకారంతో అన్నదాన సత్రం నిర్మిస్తున్నట్లు గురుబ్రహ్మం తెలిపారు. ప్రస్తుతం భవనం శ్లాబ్ నిర్మాణం వరకు పూర్తయిందని తెలిపారు.

నేడ చినపీర్ల సరగత్తు

పామూరు, జూలై 14: మొహర్రం పండుగవేడుకల్లో భాగంగా సోమవారం చినపీర్ల సరగత్తుల గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీర్లచావిడిల ముజావర్లు తెలిపారు. ఈ సందర్భంగా చావిడిల ఎదురుగా అగ్నిగుండాలనుతవ్వారు. చావిడిలను, గుమ్మటాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. సోమవారం సాయంత్రం నుంచి పామూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న నగిరి చావిడి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గూగుడు పీరావలి, సీఎస్‌పురం రోడ్డులోగల దర్గావద్ద ఉన్న చవిడిలకు సంబంధించిన పీర్లు గ్రామోత్సవంగా బయలుదేరతాయి. స్థానిక పాబోలు సెంటర్‌లో సలాములు అందుకొని గ్రామోత్సవంగా బయలుదేరుతాయని తెలిపారు.

నత్తనడకన నాడు-నేడు నిర్మాణాలు

- నిధుల లేమితో మధ్యలోనే నిలిచిపోయిన పాఠశాల భవనాలు
- వసతులు లేక విద్యార్థుల అవస్థలు



బాలికల ఉన్నత పాఠశాలలో నత్తనడకన సాగుతున్న నిర్మాణాలు

పొదిలి, జూలై 14 : గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటం చేసి చేపట్టిన నాడు-నేడు పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాటశాలలకు ధీటుగా తీర్చి దిద్దుతామని చెప్పిన హామీలు అమలు కాలేదు. పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు పనులకు నిధులు కేటాయించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

మండలంలో నాడు-నేడు పనులు కూడా నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. గతంలో ప్రారంభించిన మొదటి ఫేజ్ పనులు మాత్రం సుదీర్ఘ సాగదీతల అనంతరం పూర్తి చేసుకున్నాయి. రెండవ పేజ్‌లో నిధుల గ్రహణంతో ప్రారంభించిన నాడు-నేడు పనులు ఎక్కడి కక్కడే నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తి పనులు పాఠశాలలో దర్శనం ఇస్తున్నాయి. గత ప్రభుత్వం పాఠశాలల నిర్మాణాలకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని పులువురు విమర్శిస్తున్నారు.

పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అధికసంఖ్యలో విద్యార్థులు ఉంటారు. అసలే ఇరుకుగా ఉన్న జడ్పీ పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను కూడా చేర్చారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి పాఠశాలకు అదనపు తరగతి గదుల ఏర్పాటును రెండు సంవత్సరాల క్రితం 2022 అక్టోబరులో పనులు ప్రారంభించారు. నిర్మాణాలు అంచెలంచెలుగా నత్తనడకన పూర్తి చేస్తూ ప్రస్తుతం శ్లాబ్ లెవల్‌కు తీసుకొచ్చారు. అయితే పూర్తిగా నిధులు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణాలపై అధికారులు వారి సొంత నిధులు వెచ్చించిన ఘటనలు ఉన్నాయి. 450 మంది విద్యార్థులు ఉన్నా ఈ పాఠశాలకు సుమారుగా 15 తరగతి గదులు అవసరమని కేవలం 8 గదులు మాత్రమే ఉండటంతో మిగిలిన తరగతులు వరండాల్లో చెప్పక తప్పడం లేదు. 2022లో రూ.38లక్షలతో మూడు అదనపు గదులు ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు గాను ఇప్పటి వరకు కేవలం 15లక్షలు మాత్రమే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మిగిలిన నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణం జరగడం లేదు. ప్రస్తుతం మిగిలిన భారం నూతన టీడీపీ ప్రభుత్వంపై పడింది.

అదేవిధంగా పెద్దబస్టాండ్ కూడలిలోని బాలికల ఉన్నత పాఠశాలలో మొత్తం 575 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఇరుకుగా ఉండడంతో మరో 10 అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందుకుగాను రూ.1.15 కోట్లు నిధులు వెచ్చించారు. అందులో కొన్ని గదులు పూర్తయ్యాయి. మిగిలిన గదులు మూడు వంతుల పనులు పూర్తి చేసినా, మిగిలిన పనులు నిధుల జాప్యంలో ఆగిపోయాయి. ఇక్కడ కూడా అసంపూర్తిగానే పనులు మిగిలాయి. ఇక మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిర్మాణం మధ్యలో నిలిచిన జడ్పీ ఉన్నత పాఠశాల భవనం





మధ్యలో నిలిచిన నిర్మాణాల్లోనే తరగతులు, వరండాలోనే 3, 4 తరగతులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

విద్యుత్‌తీగ తగిలి గేదె మృతి



విద్యుత్ తీగను తగిలి మృతిచెందిన గేదె

కంభం, జూలై 14 : వ్యవసాయ పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలను తగిలి గుమ్మా వెంకటపతికి చెందిన గేదె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన కంభం మండలం రావిపాడు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్థుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం వీచిన గాలులకు రావిపాడు గ్రామానికి చెందిన అంకయ్య వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగ తెగి కింద పడింది. అదే సమయంలో వ్యవసాయ కూలీ గుమ్మా వెంకటపతికి చెందిన రూ.1.50లక్షల విలువైన పాడిగేదె మేత కోసం వెళుతూ కిందపడిన విద్యుత్ తీగను తాకి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న అధికారులు విద్యుత్‌ను నిలిపివేశారు. కాగా తమ కుటుంబ జీవనాధారమైన గేదె మృతిచెందడంతో నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

నలుగురికి స్వల్పగాయాలు



బ్రేకులు పడక చెట్టును ఢీ కొట్టిన బస్సు

పెద్ద దోర్నాల, జూలై 14: బ్రేకులు పడక వేగం అదుపు తప్పిన ప్రైవేటు బస్సు చెట్టును ఢీ కొట్టిన ఘటన ఐనముక్కుల ఆర్‌సీఎం చర్చి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రైవేటు బస్సు యాత్రికులతో శ్రీశైలం వెళ్లి దైవ దర్శనానంతరం తిరిగి వెళుతోంది. ఈ క్రమంలో చర్చి దాటగానే స్పీడు బ్రేకులు దాటించే సమయంలో బ్రేకులు పడలేదు. దీంతో అదుపు తప్పి ప్రక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొంది. దీంతో ఆ కుదుపుకు బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనను గమనించిన పలువురు 108 నంబరుకు ఫోన్ చేసి అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. క్షతగాత్రులను దోర్నాల వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. ప్రమాద సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పలువురిపై కేసు నమోదు

పొదిలి, జూలై 14 : పట్టణంలోని టైలర్స్ కాలనీలో టీడీపీ వైసీపీ కార్యకర్తలకు జరిగిన ఘర్షణలో టీడీపీ కార్యకర్త జాకీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., వైసీపీ మాజీ పట్టణాధ్యక్షుడు రబ్బాని ఆయన అనుచరులు కాలనీలో డీప్‌బోరు విషయంలో టీడీపీ కార్యకర్తలతో ఘర్షణ పడ్డారు. ఈ వివాదం పెద్దదయ్యి కొట్లాలకు దారి తీసింది. దీంతో జాకీర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయలపాలైన జాకీర్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స చేశారు. జాకీర్ ఫిర్యాదు మేరకు వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా సబ్‌స్టేషన్

గిద్దలూరు, జూలై 14 : గిద్దలూరు మండలం కంచిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ మందుబాబులకు అడ్డాగా మారింది. తెల్లవారుజాము నుంచే మందుబాబులు సబ్‌స్టేషన్ పరిసరాల్లోని గడ్డిపై కూర్చుని మద్యం సేవిస్తుంటారు. ఏ సమయంలో పడితే ఆ సమయంలో సబ్‌స్టేషన్‌లోని ఖాళీ స్థలాల్లో కూర్చుని మద్యం సేవిస్తున్నప్పటికీ, ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెల్లవారగనే కొంతమంది మద్యం సేవిస్తుండగా బెల్టుషాపులు లేకపోతే ఉదయాన్నే మద్యం ఎక్కడి నుంచి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాజపత్రాన్ని రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పొదిలి, జులై14: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలుచేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని రద్దుచేయాలని ఉపాధ్యాయుల సంఘం నాయకుడు షేక్.అబ్దుల్‌హై అన్నారు. ఆదివారం పొదిలిలోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్‌హై మాట్లాడుతూ 2023 అక్టోబరు నుంచి సీపీఎస్ ఉద్యోగులను జీపీఎస్‌లోకి తెస్తూ జీఓ విడుదల చేయడం ఉపాధ్యాయులను మోసగించడమే అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ జీవోను వెంటనే రద్దుచేసి తక్షణమే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. 2017లో కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో57ను అమలుచేసి 2003డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులందరికీ ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, బుజ్జిబాబు, పొదిలి మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, కోటేశ్వరరావు, సుబ్బారావు, బాలకాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిందని మహిళపై దాడి

మద్దిపాడు, జూలై 14: ఆవు తోకను కత్తిరించారని ఫిర్యాదు చేసిన మహిళపై అదే కాలనీకి చెందిన మహిళలు దాడి చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి ఇనమనమెళ్లూరులో చోటు చేసుకుంది. తన ఆవు తోకను కత్తిరించారని గ్రామంలోని ఎంపీసీనగర్‌కు చెందిన మహిళ మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ మహిళపై ఆ కాలనీకి చెందిన పలువురు మహిళలు దాడి చేశారు.

కంటివైద్యులు లేక నాలుగేళ్లుగా అవస్థలు

ఉన్న వైద్యురాలికి డిప్యుటేషన్ పేరుతో ఒంగోలులో విధులు

ఎర్రగొండపాలెం, జూలై 14 : ఎర్రగొండపాలెం 100 పడకల ప్రాంతీయ వైద్యశాలలో నాలుగు సంవత్సరాలుగా కంటివైద్యులు లేక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెనుకబడిన ఎర్రగొండపాలెం ప్రాంతంలో కంటి వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నారు. అయినప్పటికీ, కంటివైద్యులు లేక రోగులు తీవ్ర అవస్థల పడుతూ సుదూర ప్రాంతాలైన విజయవాడ, గుంటూరు వెళ్లి చికిత్సలు పొందుతున్నారు.

ఎర్రగొండపాలెంలో 2020 కరోనా సమయంలో కంటి వైద్యుల నియామకం చేపట్టారు. పేరుకు ఓ వైద్యురాలికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చినప్పటికీ, ఆమె ఒంగోలు రిమ్స్‌కు రెండు సంవత్సరాల క్రితం డిప్యుటేషన్‌పై వెళ్లారు. 2020లో ఎర్రగొండపాలెంలో పోస్టింగ్ తీసుకున్నప్పటికీ, ఒంగోలులో నివాసం ఉంటూనే ఎర్రగొండపాలెం వైద్యశాలలో పనిచేసినట్లు జీతాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కంటి వైద్యులు ఇక్కడ నుంచి బదిలీ అయినట్లు చూపకపోవడంతో సాంకేతికంగా ఇక్కడ పోస్టు ఖాళీగా లేదు. దీంతో మరొకరిని కూడా నియమించలేదు. ఇక్కడ నుంచి ఒంగోలు రిమ్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన కంటి వైద్యులుకు ఎర్రగొండపాలెం నుంచే జీతం అందిస్తున్నారు. అయితే ఎర్రగొండపాలెం ఏరి యా వైద్యశాలలో కంటి వైద్యులు లేక వైద్యశా లకు వచ్చే కంటిరోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగొండపాలెం వైద్యశాలకు కంటి వైద్యులను నియమించాలని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్యాధికారి వివరణ

ఈ అంశాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ యాదిద్య దృష్టికి తీసుకెళ్లగా, కంటివైద్యులను నియమించమని కమిషనరుకు నివేదిక పంపినట్లు తెలిపారు.



ఎర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాల

ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ముస్లిం నేతల పరామర్శ



ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న ముస్లిం నాయకులు

మార్కాపురం, జూలై 14: ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డిని పట్టణానికి చెందిన పలు ముస్లిం ధార్మిక, సామాజిక, సేవా సంస్థల ప్రతినిధులు ఆదివారం పరామర్శించారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లిన పలు సంస్థల ప్రతినిధులు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సలహామండలి సభ్యులు అష్రఫ్ అలి, పట్టణ అధ్యక్షులు సికిందర్, ఐఎంఎం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, ఎస్ఐవో పట్టణ నాయకులు ఖాలిద్, జేఐహెచ్ సభ్యులు నజీర్, మహమ్మద్ ఖాన్, ఖాసింబాషా, రఫీ, అజీమ్, రసూల్, షమీమ్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మైనార్టీ పట్టణ అధ్యక్షులు షాకీర్, పి.హుసేన్ ఖాన్, రహీం, నాసర్, బాబు, హబీబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, జూలై 14 : పట్టణంలోని అభిలాష్ మిని ఫంక్షన్ హాలులో జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1985 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 4 దశాబ్దాల తరువాత 80 మంది విద్యార్థులు సమ్మేళనం కార్యక్రమానికి హాజరై ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సన్మానించారు. నాటి మిత్రుడు పేదరికంతో ఉండగా రూ.40వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు ముత్తుముల రంగారెడ్డి, మేకబోయిన గురుప్రసాద్, గుర్రం శోభన్‌బాబు, పిడతల పవన్‌కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేర్రాజు



మహాసభలో మాట్లాడుతున్న ఫణి పేర్రాజు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 14: కోఆపరేటివ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కోఆప రేటివ్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశపుహాలు ఆదివారం అసోసియేషన్ మహాసభకు జిల్లా అధ్యక్షుడు బీసీ. మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పేర్రాజు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ విధుల నుంచి సహకార శాఖ ఉద్యోగులను విముక్తులను చేసినందుకు ఆశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకారశాఖలో డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేసి శాఖ నైపుణ్యతను కాపాడటంతో పాటు ఉద్యోగోన్నతులు ఇచ్చిన ఉద్యోగులకు విధిగా శిక్షణ ఇచ్చిన తర్వాతనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. ఆడిట్‌లో చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఉద్యోగులకు అసోసియేషన్ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుల వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ కనకదుర్గారెడ్డి, జిల్లా సెక్రటరీ డి.థామస్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరూ వెనక్కి తగ్గారు..!

- వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బూచేపల్లి పేరు పరిశీలన
- ఒంగోలు కార్పొరేషన్‌పైనే అందరి దృష్టి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ అధినేత జగన్, జిల్లాలో ఆపార్టీ కీలక నేత బాలినేని శ్రీనివాసరెడ్డి ఇద్దరూ కాస్తంత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తదగుణంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా స్థానికుడినే నియమించేందుకు పరిశీలన ప్రారంభించారు. అయితే ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీకి గుడ్‌బై చెప్పే కార్పొరేటర్ల అంశం ఇంకా కొలిక్కిరాలేదు. సోమవారం ఒంగోలు రానున్న మాజీ మంత్రి బాలినేని చెప్పే మాటలను కొందరు కార్పొరేటర్లు గౌరవిస్తారా? లేకా టీడీపీ గూటికి చేరతారా? అన్నది తేలాల్సి ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించాలనుకోవడం, దానిని బాలినేని తీవ్రంగా వ్యతిరేకించడం, ఆపై బాలినేనితో సజ్జల రామకృష్ణారెడ్డి మంతనాలు చేయడం తెలిసిందే. అందిన సమచారం మేరకు చెవిరెడ్డిని నియమించే విషయంలో పునరాలోచనకు జగన్ ఓకే అన్నట్లు తెలిసింది. అదే సమయంలో జిల్లాలో ఎవరికి అధ్యక్ష పదవి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని బాలినేని చెప్పినట్లు సమాచారం. దీంతో జగన్ కూడా కాస్తంత వెనక్కి తగ్గి చెవిరెడ్డి నియామకాన్ని తాత్కాలికంగా ఆపాలని చెప్పినట్లు తెలిసింది. అయితే పార్టీ అధ్యక్ష పదవి జిల్లాలో ఎవరికి ఇవ్వాలన్న అంశంపై తర్జనభర్జనలు ఆరంభమయ్యాయి. అందులో భాగంగా దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి పేరును ప్రధానంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని కొనసాగించాలన్న ఆలోచన ఉన్నప్పటికీ బూచేపల్లి అయితే ఇటు ఆయన ఎమ్మెల్యేగా, ఆయన తల్లి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నందున ఎక్కువ ఉపయోగం ఉంటుందన్న ఆలోచనతో ఆవైపు అధిష్ఠానం దృష్టి సారించింది.

ఒంగోలు కార్పొరేషన్‌పై సర్వత్రా చర్చ

ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్ల పార్టీ మార్పు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేనకు చెందిన ఏడుగురితోపాటు వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లతో కార్పొరేషన్‌లో టీడీపీ బలం 13కు చేరింది. మరో 13 మంది టీడీపీలోకి జంప్ చేస్తే వైసీపీ పట్టు కోల్పోతోంది. మేయర్ సుజాతను పక్కనబెట్టి కొందరు కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకునేందుకు ఆపార్టీ సిద్ధమైంది. ఈనేపథ్యంలో తాను ఒంగోలు వచ్చి మాట్లాడతానని, అప్పటిదాకా ఆగాలని బాలినేని వైసీపీ కార్పొరేటర్లకు సూచించారు. దీంతో ఆదివారం టీడీపీలో చేరేందుకు సిద్ధమైన వైసీపీ కార్పొరేటర్లు పలువురు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. బాలినేని చెప్పాల్సిన అంశాలన్నీ చెప్పి సోమవారం రాత్రికే తిరిగి హైదరాబాద్ వెళతారని తెలిసింది. కొద్దిరోజులు కుటుంబంతో కలిసి విదేశాల్లో ఉన్న తన చెల్లి వద్దకు ఆయన వెళ్లనున్నట్లు తెలిసింది. ఆతర్వాత వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలోకి జంప్ అవుతారా? లేక సోమవారం బాలినేనితో చర్చించిన అనంతరం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారా? అనేది చూడాల్సి ఉంది.

అవీ..ఇవీ..

నేడు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పర్యటన

బేస్తవారపేట, జూలై14: స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేడు బేస్తవారపేటలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని రాణిపేట వద్ద నుంచి బేస్తవారపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు జరిగే భారీ ర్యాలీలో పాల్గొనున్నారు. పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని నాయకులు బి.ప్రేమానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ఘన విజయం సాధించి మొదటిసారిగా బేస్తవారపేట మండలం వస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు మండలంలోని కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రేమానంద్ తెలిపారు.

పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 14: పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యాక్షులు డా.బి.శరత్ అన్నారు. స్థానిక రెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో పర్యావరణంపై రంగులు ప్లాస్టిక్ ప్రభావం అనే అంశంపై ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యం వలన అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయన్నారు. దీంతో ప్రపంచ దేశాలన్ని అతలాకుతలం అవుతున్నాయన్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు కరువు సంభవిస్తోందన్నారు. జేవీవీ జిల్లా నాయకులు రావికుమార్ మాట్లాడుతూ. మొక్కలు నాటి వాటిని పెంచి పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు రఫీ, వెంకట్రావ్, విప్లవ్‌కుమార్, రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 14: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వ హించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్ప మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో పండుగ చేసుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

గిద్దలూరు, జూలై 14 : అన్ని కులాలు, మతాలు ఒకటేనని, భక్తిశ్రద్ధలతో ఎవరు నమ్మిన పండుగలు వారు చేసుకోవాలని రూరల్ సీఐ దాసరిప్రసాద్ అన్నారు. రాచర్లలోని వివిధ వర్గాల ప్రజలతో పోలీసులు సమావేశమయ్యారు. పీర్లపండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్మానియేలు, వివిధ పార్టీల, వర్గాల ప్రతినిధులు దప్పిలి కాశిరెడ్డి, ఎం.మనోహర్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు



కూష్మాండ పూజలు చేస్తున్న అర్చకులు

త్రిపురాంతకం, జూలై 14: వారాహి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా తొమ్మిదో రోజు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి, ఫణీంద్రకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ గోపురంపై ఉన్న వారాహి అమ్మవారికి పంచామృత అభిషేకం, పుష్పార్చ న, మండపారాధన, అష్టోత్తరం, పార్థివ లింగార్చన, చినమస్తాదేవి అమ్మవారి వద్ద కూష్మాండ పూజ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చిన్నషరిగెత్



తుమ్మలచెరువు దర్గాలో కొలువుదీరిన పీర్లు

తర్లుపాడు, జూలై 14: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని తుమ్మలచెరువులో ఆదివారం తెల్లవారుజామున చిన్న షరిగెత్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకాశీం, పెద్ద కాశీం పీర్లతో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షణలు చేశారు. చిన్నషరిగెత్ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి పెద్దషరిగెత్ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ముజావర్లు తెలిపారు. ఈ కార్యక్రమాని సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నషరిగెత్ కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వేముల సుధాకర్ పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

పొదిలి, జూలై 14 : మొహర్రం సందర్భంగా ఆదివారం పీర్లచావిడి వద్ద చిన్న పీర్లతో చిన్నషరగత్తు నిర్వహించారు. పాతూరులో ప్రధానవీధులైన వడమటి పాలెం, తూర్పుపాలెంలలో పీర్లను ఊరేగించారు. ఈ నెల 16న పెదషరగత్తు, 17న మొహర్రం సందర్భంగా పట్టణంలో భారీ ఊరేగింపుగా పీర్లు బావికి చేరుతాయని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటికే పెద్దషరగత్తు జరిగే ప్రాంతాల్లో గుండాలను ఏర్పాటు చేశారు. చివరిరోజు పీర్ల ఊరేగింపును చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

పొదిలి, జూలై 14 : వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ వెలుగోలు కాశీనాథ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో కష్టపడినా తగిన గుర్తింపు ఇవ్వలేదని అందుకు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చినా తనలాంటి వాళ్ళకు గుర్తింపు ఇవ్వకపోవడంతో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూలై 14: జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు.ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా సాగుతున్న అన్నదాన సత్రం పనులు

తాళ్లూరు, జూలై 14: పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమవరప్పాడు పరిధిలోని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. గంగాభవానీ ఆలయకమిటీ అధ్యక్షుడు కొసనా గురుబ్రహ్మం దేవాలయ నిధులకు తోడు దాతల సహకారంతో నిధులు సమకూర్చి దాదాపు రూ40లక్షల అంచనాలతో అన్నదాన సత్రం నిర్మిస్తున్నారు. గంగమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు దాతల సహకారంతో అన్నదాన సత్రం నిర్మిస్తున్నట్లు గురుబ్రహ్మం తెలిపారు. ప్రస్తుతం భవనం శ్లాబ్ నిర్మాణం వరకు పూర్తయిందని తెలిపారు.

నేడు పామూరులో గ్రామోత్సవం

పామూరు, జూలై 14: మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా సోమవారం చినపీర్ల సరగత్తుల గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీర్లచావిడిల ముజావర్లు తెలిపారు. ఈ సందర్భంగా చావిడిల ఎదురుగా అగ్నిగుండాలనుతవ్వారు. చావిడిలను, గుమ్మటాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. సోమవారం సాయంత్రం నుంచి పామూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న నగిరి చావిడి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గూగుడు పీరావలి, సీఎస్‌పురం రోడ్డులోగల దర్గావద్ద ఉన్న చవిడిలకు సంబంధించిన పీర్లు గ్రామోత్సవంగా బయలుదేరతాయి. స్థానిక పాబోలు సెంటర్‌లో సలాములు అందుకొని గ్రామోత్సవంగా బయలుదేరుతాయని తెలిపారు. హిందూ ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్ల ఊరేగింపును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 14: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా దేవస్థానంలో అర్చకులు ఎం.సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, దేవతమూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో విశేషఅలంకరణచేసి పూజలు నిర్వహించారు. మేళతాళాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. అనంతరం గోశాలలోని గోమాతకు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన ఛైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహబాబు, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వసతులు మెరుగుపరుస్తాం

దర్శి, జూలై 14: దర్శి బస్టాండ్‌లో మౌలిక వసతులు పెంపొందించి అన్ని బస్సులు అక్కడకు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ పొదిలి డిపో మేనేజర్ సుందరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్ శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎన్‌ఏపీ నీరు సక్రమంగా రాకపోవటంతో మంచినీటి కొళాయిలకు నీరు రావటం లేదన్నారు. నీటి వసతి లేకపోవటం వల్ల టాయిలెట్స్ మూసివేశామన్నారు. వీలైనంత త్వరలో బస్టాండ్‌లో అన్ని వసతులు కల్పిస్తామని ఆయన వివరించారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- అంబవరం జడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 220 మంది విద్యార్థులు
- 12 మందికి నలుగురే విద్యాబోధన



అంబవరం జడ్పీ ఉన్నత పాఠశాల

సీఎస్‌పురం(పామూరు), జూలై 14: సీఎస్‌పురం మండలం అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సజక్ట్ టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు సీఎస్‌పురం మండలంలో విద్యపరంగా అంబవరం పాఠశాలకు ఘన చరిత్ర ఉంది. నేడు ఉపాధ్యాయుల కొరతతో కునారిల్లుతుంది. ఈపాఠశాలలో 12 మంది ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడుతో కలిసి నలుగురు ఉపాధ్యాయులే విద్యాబోధన చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 220 విద్యార్థులు ఉన్నారు. ఆరో తరగతిలో 45 మంది, 7లో 35 మంది, 8లో 50 మంది, 9లో 40 మంది, పదో తరగతిలో 45 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇంగ్లీష్, లెక్కల సబ్జెక్టుల్లో రెండేసి పోస్టులు, సామాన్యశాస్త్రం, సోషల్, పీఈటీ, హిందీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉంది. బయాలజీ, పీఈటీ పోస్టులు గత నాలుగు సంవత్సరాలుగా భర్తీ చేయలేదు. 1962లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశాక, ఇంత మంది ఉపాధ్యాయుల కొరత ఎన్నడూలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది ఈ పాఠశాలలోనే 3,4,5 తరగతులను విలీనం చేశారు. 20 మంది విద్యార్థులు ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిఉండగా కనీసం ఒక్కరు కూడా లేకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన షాదీఖానా

దొనకొండ, జూలై 14: దొనకొండలో గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన షాదీఖాన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నీ జిల్లాలకు 2016లో ఒకొక్క షాదీఖానా నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసింది. దొనకొండకు మంజూరైన షాదీఖానా నిర్మాణం గురించి ప్రారంభంలో నాయకులు పట్టించుకోలేదు. అనంతరం అప్పటి మండల కోప్షన్‌సభ్యుడు షేక్ గౌస్ దొనకొండలో షాదీఖాన ఏర్పాటుకు ప్రత్యేకచొరవ తీసుకొని అప్పటిమంత్రి శిద్దా రాఘవరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో అప్పటి అధికారులు ప్రధాన రహదారి ప్రక్కన షాదీఖానా నిర్మాణానికి ఎకరా యాభై సెంట్లు ప్రభుత్వభూమి కేటాయించారు. దీంతో మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ.15 లక్షలతో నిర్మాణం తలపెట్టేందుకు టెండరు ఖరారుకావటంతో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు మార్చి 1,2019లో శంకుస్థాపన చేశారు. ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలలోకి రావడంతో దీనిగురించి పట్టించుకోలేదు. దాదాపు ఐదు సంవత్సరాలుగా పునాది గుంతలకే పరిమితమైందే తప్ప నిర్మాణం పనులు అడుగు ముందుకుపడలేదు. షాదీఖానా నిర్మాణం దాని ప్రాముఖ్యత గూర్చి పలుమార్లు అప్పటి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

మండలంలోని దొనకొండ, కొచ్చెర్లకోట, వద్దిపాడు, ఎన్‌ఎన్‌పాలెం తదితర గ్రామాలలో దాదాపు 900 ముస్లిం కుటుంబాలు జీవిస్తున్నారు. వివాహ, ఇతర శుభకార్యాలు, సమావేశాలకు దొనకొండలో సరైన సౌకర్యంలేక అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలకులు దొనకొండకు మంజూరైన షాదీఖానా నిర్మాణం గురించి ఐదేళ్లుగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వది లేయడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన షాదీఖానాను, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కనిగిరిలో పడకేసిన పారిశుధ్యం

- మురుగు పారదు.. సమస్య తీరదు!
- కొద్దిపాటి వర్షానికే రోడ్లపైకి చేరుతున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తీగలగొందిలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి చేరిన మురుగునీరు



లాడేసాహెబ్ వీధి మలుపు వద్ద నిలిచిపోయి మురగునీరు

కనిగిరి, జూలై 14: కనిగిరి పట్టణం పారిశుధ్య లేమితో కొట్టుమిట్టాడుతుంది. ఏళ్లతరబడి డ్రైనేజీ సమస్య పరిష్కారం కావటం లేదు. ఇటీవల చెప్పులబజారు, పామూరు బస్టాండులోని ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌ల కింద ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయలేదు. చెక్‌పోస్టు వద్ద నుంచి పట్టణంలోని ఒంగోలు బస్టాండు మీదుగా వచ్చే భారీ డ్రేనేజీల రోడ్డుకిరువైపులా ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు చెక్‌పోస్టు నుంచి ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు వరకు ఆక్రమణల తొలగింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోపక్క గార్లపేట రోడ్డు నుంచి పామూరు బస్టాండు చెప్పుల బజారులోని చర్చి గోడవైపు ఉన్న డ్రైనేజీల్లోని పూడిక పనులు చేపట్టారు. లాడేసాహెబ్ వీధి మలుపు వద్ద ఉన్న డ్రైనేజీ పూడికతో నిండిపోయి మురగునీరు నిలిచిపోయింది. ఎమ్మెస్సార్ రోడ్డు నుంచి తీగలగొందిలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువల్లో పూర్తిగా పూడిక చేరుకుని మురుగునీరు కదలడంలేదు. ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికే మురగునీరు, చెత్తాచెదారాలు రోడ్డుపైకి చేరాయి. పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధికారులు చేపట్టాల్సిన చర్యలను గాలికొదిలేశారు. చెక్‌పోస్టు నుంచి పామూరు బస్టాండు వరకు, పామూరు బస్టాండు నుంచి కొత్తూరు వరకు, పామూరు బస్టాండు నుంచి డిపో వరకు, గార్లపేట బస్టాండు నుంచి పామూరు బస్టాండు వరకు, ఎమ్మెసార్ రోడ్డు, వైఎస్సార్ రోడ్డులోని ప్రధాన డ్రైనేజీలన్నీ పూడిక పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి కనిగిరి పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం

- పట్టించుకోని పాలకులు
- పాడయిన వస్తువులు
- పూర్వవైభవం తీసుకురావాలని కూటమి ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి



ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ఎన్‌ఏపీ అతిథి గృహం

దర్శి, జూలై 14: దర్శి పట్టణ సమీపంలోని ఎన్‌ఏపీ రక్షణ మంచినీటి చెరువు వద్ద నిర్మించిన అతిథి గృహం ఏళ్ల తరబడి మూలనపడింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన అతిథి గృహం నిర్వాహణలోపంతో నిరుపయోగంగా మారింది. 1980లో నెథర్లాండ్ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. ఆ పథకాన్ని పరిశీలించేందుకు ఆ దేశ ప్రతినిధులు వస్తుంటారనే ఉద్దేశంతో చెరువు పక్కనే అతిథి గృహం నిర్మించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆ పథకాన్ని ప్రారంభించారు. ఆసందర్భంగా నెథర్లాండ్ దేశానికి చెందిన అతిథులు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొని ఇందులో విడిది చేశారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు దర్శికి ఎవరొచ్చినా ఇక్కడ ఉండేవారు. అతిథి గృహానికి ఇరువైపులా కొండలు, మధ్యలో ఎన్‌ఏపీ చెరువు, మరోవైపు పచ్చని పొలాలతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది.

కాలక్రమంలో ఎన్‌ఏపీ స్కీమ్ నిర్వాహణకు కూడా ప్రభుత్వాలు సక్రమంగా నిధులు ఇవ్వటంలేదు. గత వైసీపీ ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఫిల్టర్‌బెడ్లు పూర్తిగా చెడిపోవటంతో రా వాటర్ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో అతిథి గృహం కూడా మూతపడింది. లోపల విలువైన సామాన్లు కాలం చెల్లిపోవటంతో చెడిపోయాయి. ఆతర్వాత అభివృద్ధి పనుల గురించి పట్టించుకోకపోవటంతో తలుపులు, కిటికీలు, ఇతర సామాన్లు దెబ్బతిన్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎన్టీఆర్ ప్రారంభించిన అతిథి గృహాన్ని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సహజ వనరులను దోచుకున్నవారు నీతులు చెప్పడం విడ్డూరం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం



దర్శి, జూలై 14: వైసీపీ నాయకులు చెబుతున్న మాటలు, నీతి వాఖ్యాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదలచేశారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజాధనాన్ని, సహజ వనరులను దోచుకున్న నాయకులు ఇప్పుడు నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి నెల రోజులు మాత్రమే గడిచినప్పటికీ అప్పుడే హామీలు అమలు చేయలేదని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించటం శోచనీయమన్నారు. తల్లికి వందనం పథకం అమలుకు విధివిధానాలు రూపొందిస్తుండగా, అప్పుడే ఒక బిడ్డకు మాత్రమే ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేయటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిప్పర్ ఇసుక ఎంతకు విక్రయించారో కనిపించలేదా అని ప్రశ్నించారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇసుక ఉచితంగా ఇస్తున్నట్టు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. టిప్పర్ ఇసుకకు ఇప్పుడు రూ.7వేలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టిప్పర్‌కు రూ.30 వేలు తీసుకున్న విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేస్తున్న విమర్శలు చూసి దర్శి నియోజకవర్గ ప్రజలు చీదరించుకుంటు న్నారని, ఆయన్ను ఎందుకు గెలిపించుకున్నామా అని ఇప్పుడు బాధపడుతున్నారని విమర్శించారు. దర్శి నియోజకవర్గంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ఛైర్‌పర్సన్ పదవిని అడ్డంపెట్టుకొని వైసీపీ కార్యకర్తలకు అడ్డగోలుగా నిధులు దోచిపెట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా 90 శాతం మట్టి పనులు కేటాయించి వైసీపీ కార్యకర్తలకు దోచిపెట్టారని విమర్శిచారు. జిల్లా పరిషత్‌లో అడ్డగోలుగా పనుల కేటాయింపు, అనేక చోట్ల తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కరోజులో పింఛన్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అమరావతి నిర్మాణానికి శరవేగంతో తీసుకుంటున్న నిర్ణయాలు కనపడలేదా అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పాలన పట్ల అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుండగా, వైసీపీ నాయకులకు దిక్కుతోచక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు ఇచ్చిన తీర్పు చూసిన తర్వాత కూడా జ్ఞానోదయం కాలేదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రజలు ఉన్న సీట్లు కూడా లేకుండా చేస్తారని డాక్టర్ లక్ష్మి స్పష్టం చేశారు.

తాళ్లూరులో ట్రాఫిక్ కష్టాలు

- రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులకు తప్పని పాట్లు



తాళ్లూరులో తరచూ ట్రాఫిక్‌తో నిలిచిపోతున్న వాహనాలు

తాళ్లూరు, జూలై 14: తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రభుత్వం రోడ్లు విస్తరించి కాలువలు నిర్మించింది. కాలువలు ముందుకువచ్చి వ్యాపార సంస్థలు ఏర్పాటుచేయటంతో ట్రాఫిక్ స్తంభిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలను అడ్డంగా నిలబెడుతున్నా, సైడు కాలువల ముందుకు వచ్చి తోపుడు బండ్లు పెడుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

మండల కేంద్రమైన తాళ్లూరు, వ్యాపార కేంద్రమైన తూర్పుగంగవరం గ్రామాల్లో రోడ్లు ఆక్రమణకు గురై ట్రాఫిక్‌కు తరుచూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో గత టీడీపీ ప్రభుత్వపాలనలో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి ఆయాగ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి సైడు కాలువల నిర్మాణాలు చేపట్టారు. కాలువ నిర్మాణాల పూర్తయిన కొంతకాలం వరకు రోడ్లు వెడల్పుగా ఉన్నప్పటికీ ప్రస్తుతం నియంత్రణ తప్పింది. గతకొంతకాలంగా ఆయాగ్రామాల్లో వాహనాల రద్దీ పెరగటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను పరిష్కరించాల్సిన గ్రామపంచాయతీ, పోలీసు శాఖలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాళ్లూరు గ్రామంలోని వెల్లంపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి బొద్దురాయి వరకు గల రహదారి, వెల్లంపల్లి రోడ్డు బస్టాండ్ సెంటర్ నుంచి తూర్పుగంగవరం రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ రహదారిలో బ్యాంక్ ఉండటంతో, ఇక్కడికి పనుల నిమిత్తం వస్తున్న ఖాతాదారులు తమ ద్విచక్రవాహనాలను నిలుపుదల చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బ్యాంక్ ముందువైపు నుంచి జూనియర్ కళాశాల వరకు ఇరువైపులా కాలువను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి రాములవారిమేడ వరకు గల రోడ్లను ఆక్రమించుకుని ముందుకు రావటంతో వాహనాలను రోడ్లపై నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

తూర్పుగంగవరం గ్రామంలో తాళ్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి చీమకుర్తి బస్టాండ్ సెంటర్, బొద్దికూరపాడు బస్టాండ్ సెంటర్ నుంచి హైస్కూలు వరకు గల రోడ్డుకు ఇరువైపులా గల కాలువలను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలకు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై వచ్చే ప్రజలు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. ఆ మార్గాల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాలు రద్దీ ఎక్కువగా ఉంటుంది. గతంలో పోలీస్ శాఖ ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించేవారు.

ఇప్పటికైనా పోలీస్‌శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

దర్శి, జూలై 14: నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. దర్శిలో జరుగుతున్న ఏపీటీఎఫ్ జిల్లాస్థాయి ఉద్యమ, అధ్యయన తరగతుల్లో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉద్యమాల ద్వారా ఎన్నో సమస్యలను సాధించుకున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఎల్లప్పుడూ పోరాటంలో ముందంజలో ఉంటుందన్నారు. 1947 నుంచి ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత సంఘానికి దక్కుతుందన్నారు. ఏపీటీఎఫ్ పోరాటం ద్వారానే టైంస్కేలు, ట్రిబుల్ బెనిఫిట్ స్కీమ్ సాధించినట్టు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబించిందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, వరప్రసాదరావు, గురునాదశర్మ, బెజవాడ రఘుబాబు, డి.శ్రీనివాసులు, ఐ.విజయసారథి, నాయబ్‌రసూల్, హనుమంతరావు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

మానవసేవ పరమాత్ముని సేవగా భావించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 14: మానవసేవ పరమాత్ముని సేవగా ప్రతిఒక్కరూ భావించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ రోడ్డులోని పిరమిడ్ యోగా మందిర్‌లో మానవతా శాఖ నూతన కార్యకర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలో మానవతా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పరులకు సేవ చేయటం కర్తవ్యంగా భావిస్తూ ఎంతోమంది పేదలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను తీరుస్తున్న మానవతాసంస్థ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. సమాజంలో మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాల క్రమంలో ఇలాంటి సంస్థలు అందిస్తున్న సేవలు మనుషుల సత్సంబంధాలు పెంపొందుతాయన్నారు. ప్రతిఒక్కరూ మానవతా సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.

సమావేశంలో కేటీఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), మానవతాసంస్థ నాయకులు సామిశెట్టి శ్రీనివాసులు, గుత్తి శ్రీధర్, పసుపలేటి అరుణోదర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మాంటిస్సోరి పిచ్చిరెడ్డి, తానిగుండాల శ్రీనివాసరెడ్డి, పసుపులేటి వాణి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలుచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, పక్కన జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి జూలై 14: టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అమ్మకు వందనం పథకాన్ని నున్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఉచిత ఇసుక అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో దోపిడీ జరుగుతుందన్నారు. టీడీపీ వర్గీయులకే ఇసుక సరఫరా చేస్తున్నారని విమర్శిం చారు. అమరావతి రాజధాని ఎప్పట్లోగా పూర్తి చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వి.వెంకటరెడ్డి, తాళ్యూరు మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

పీసీపల్లి, జూలై 14: తాగునీరు సరఫరాచేసే మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూసీ ఏఈ జి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం పంచాయతీల్లోని గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో కలిసి మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. తాగునీరు కలుషితమైతే డయేరియా ప్రబలే ప్రమాదముందన్నారు. మంచినీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేసుకుంటూ శుభ్రంగా ఉంచాలని సర్పంచ్‌లను ఆదేశించారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లను పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల సమీపంలో మురుగునీరు నిల్వ లేకుండా ఉండేలా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనపర్తి శాంసన్, ఉపసర్పంచ్ కుందూరు కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన తిరునాళ్ల

పామూరు, జూలై 14: పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధిలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థాన తిరునాళ్ల ఈనెల 17 వరకు జరుగుతున్నాయి. తొలిరోజు ఆదివారం గణపతి పూజ, అభిషేకాలు, సుదర్శన హోమాలు నిర్వహించారు. సాయంత్రం నవగ్రహ అష్టదిక్పాలక హోమాలు, మహానైవేద్యం భక్తులకు సమర్పించారు.


బాపట్ల మున్సిపల్ కార్యాలయం సమీపంలో తవ్వకాల్వలో పెరిగిన తుంగ, నిలిచిన మురుగు

మురుగు బురద


మాచర్ల: శ్రీనివాస థియేటర్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు

వానొస్తే.. వణుకే.. పట్టణాల్లో ఇదీ పరిస్థితి. వాన ఆ వెంట వచ్చే బురద.. ఆ తర్వాత రోడ్లపై పేరుకుపోయే బురదతో ప్రజలు అల్లాడుతుంటారు. మురుగుతో కలిసే బురదకు తోడు చెత్తాచెదారాలు పేరుకుపోయి దోమలు, దుర్వాసనతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అసలే అంతంతమాత్రంగా ఉండే పారిశుధ్యం.. వర్షాలు పడిన ప్పుడు మరింత అధ్వానంగా మారుతుంది. మున్సిపల్ కేంద్రాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండ టంతో ఓ మోస్తరు వర్షాలకే రహదా రులు తటాకాలను తలపిస్తుంటాయి. వర్షపు నీరు పోయేంత సామర్థ్యం లేకపోవడంతో వాన నీటితో కలిసిన మురుగు రోడ్లపైకి చేరుతుంది. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు గురించి తెలి సినా మున్సిపల్ పాలకులు, అధికారులు పరిష్కారాలపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గత ఐదేళ్లు వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లోని సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం పలు పట్టణప్రాంతాల్లో ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పాడు పెట్టడం, అవుట్‌ఫాల్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు వెచ్చించకపోవడంతో ప్రస్తుతం మున్సిపల్ ప్రజలకు శాపంగా మారింది.

- మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం
- మున్సిపల్ కేంద్రాల్లో అధ్వానపు డ్రెయిన్లు
- ఓ మోస్తరు వర్షానికే పొంగిపొర్లే కాల్వలు
- దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం.. వ్యాపిస్తున్న వ్యాధులు
- ఐదేళ్లు పట్టణాలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

డ్రెయిన్లపై రూపాయి ఖర్చు లేదు..

ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్రెయినేజీలపై వైసీపీ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా ఖర్చుపెట్టలేదు. ప్రజలు ఇక్కట్లు పడుతున్నా పట్టించు కోకుండా మున్సిపాలిటీ నిధులను సైతం పక్కదారి పట్టించింది. వాగు లు, కాలువల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని గతంలో పలుమార్లు ప్రజలు స్పందనలో ఇచ్చిన అర్జీలన్నీ బుట్టదాఖల య్యాయి. ప్రజల నుంచి ఆస్తి పన్నును ముక్కుపిండి వసూలు చేసే మున్సి పాలిటీ మౌలిక వసతులను కల్పించడంపై మాత్రం దృష్టిపెట్టలేదు. ఆస్తి పన్ను రూపేణా వచ్చే నిధులను దారి మళ్లించారు తప్పితే ప్రజల అవస్థలను పట్టించుకోలేదు.


బాపట్ల కొత్తబస్టాండ్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు డ్రైనేజీలోకి వెళ్ళకుండా ఉన్న దృశ్యం.

అతిసార కేసులు నమోదు

పట్టణాల్లో అతిసారం కేసులు నమోదవు తున్నాయి. మరణాలు కూడా సంభవి స్తున్నాయి. గుంటూరు, తెనాలి, పిడుగురా ళ్ల పట్టణాల్లో అతిసార వ్యాప్తి చెందిన విషయం తెలిసిందే. పిడు గురాళ్లలో డయేరియా మరణాలు చోటు చేసు కున్నాయి. ఒక వైపు అతిసారం కేసులు నమోదు అవుతు న్నా పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించడంలేదు. వర్షం కురిస్తే పట్టణాలు చిత్తడి చిత్తడిగా మారుతున్నా యి. రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పురపాలకులు అప్రమత్తమై ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.


చీరాలలో ముక్కోణపు పార్కు రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి):అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురు స్తున్న ముసురు వర్షాలతో మున్సిపల్ పట్టణాల్లో పారి శుధ్యం ఎంత అధ్వానంగా ఉందో బహిర్గతమైంది. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో ప్రధాన రహదారులు కూడా మురుగు, బురదతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక ఆయా జిల్లాల్లోని మున్సిపల్ పట్టణాల్లో వర్షాలు పడినప్పుడల్లా పారిశుధ్యం అధ్వానం గా మారుతుంది. దీంతో ప్రజలు వర్షాలు పడుతున్నా యంటే భయాందోళనలు వ్యక్తం చేస్తుంటారు. మురుగు, బురద, దోమలు, దుర్వాసనలు.. ఆపై రోగాలతో ప్రజలు అల్లాడిపోవాల్సిందే. అస్తవ్యస్త పారిశుధ్యంతో డయేరి యాలాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వ్యర్థాలు రోడ్ల మీదకు వస్తున్నా యి. దీంతో పట్టణా లు మురికి కూపాలుగా దర్శన మిస్తున్నాయి. పట్టణ ప్రాంతా లను ప్రధానంగా డ్రెయినేజి సమస్య పట్టిపీడిస్తున్నది. ఉన్న డ్రెయినేజీలు పూడి కతో నిండిపోయాయి. తుంగ, వ్యర్థాలు పేరుకు పోయి మురుగు ముం దుకెళ్లే పరిస్థితి లేదు. దీనివల్ల ఎక్కడ ము రుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతు న్నది. పారిశుధ్యం అధ్వానంగా మారి చిను కులు పడుతున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాలు, వాంతులు, వీరోచనాల తో ఆస్పత్రులు బాట పట్టాల్సి వస్తోంది. వర్షాలు పడినప్పుడల్లా మీడియం, మైనర్ డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగు మేజర్ డ్రెయిన్ గుండా ప్రవహించకపోవడంతో అనేక చోట్ల మురుగు ఉబికి రోడ్లమీదకొస్తున్నది.

● పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పుర పాలక సంఘాలలో వరద, మురుగు నీటి కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో వర్షపు నీరు నిలిచి పోతున్నది. దోమల వ్యాప్తి ఉధృతం కానున్నది. అం టువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన సర్వత్రా నెల కొంది. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్ట డాన్ని పురపాలకులు విస్మరించారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు పట్టణాల్లో ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అను భవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నా పురపాలకులు అలస త్వాన్ని వీడటంలేదు. వర్షాల సమయంలో ముంపు బాధితులకు పరిహారం అందించే కన్నా ఇళ్లు ముంపునకు గురవ్వకుండా ముందస్తు చర్యలు తీసు కోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మ రిస్తున్నారు.

దీనివల్లే ఏటా పేదలు పట్ట ణాల్లో వరద ముంపు కష్టాల ను ఎదు ర్కొంటున్నారు. అధికారం అండతో కాల్వల పై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడంలేదు. కాల్వలు, డ్రెయిన్లు ఆక్రమణలతో కుచించుకు పోవడంతో వర్షాలు కురిస్తే నీరు రోడ్లపై ప్రవ హిస్తోంది. వరద నీటి కాల్వలను పునరుద్ధరిం చకుంటే వర్షాలు కురిసినప్పుడల్లా పల్లపు ప్రాం తాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు. వరద, మురుగు కాలుల్లో పూడిక తీత తక్షణావసరంగా ఉన్నా ఈ దిశగా పురపాలకులు స్పందించడంలేదు.

ప్రత్యేక శ్రద్ధపెట్టాలి..

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు


బాపట్ల :పాతకోర్టుభవనం ఎదురు కాల్వలో ముందుకు సాగని మురుగునీరు

కోరుతున్నారు. అధ్వానంగా మారిన మురుగునీటి పారు దల వ్యవస్థను తక్షణం సంస్కరిం చాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీల్లో పూడికలు తీసి వరద నీరు నిల్వకుండా చే యాలి. మురుగు కాలువల్లో పూ డిక తీయాలని ఇటీవల ము న్సిపల్ మంత్రి నారాయణ అధికారులను ఆదే శిం చినా వారు మొద్దు నిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. ప్రతి మున్సిపాల్టీ లో వేసవిలోనే మురుగునీటి వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉంది. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బం దులు లేని విధంగా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురి స్తే పల్లపు ప్రాంతాలు ముంపుకు గురవ్వకుండా వరద నీటి, ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపునకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాలలో కాలువలను అభివృద్ధి చేయాలి. పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి.

ఐదేళ్లు పాడుపెట్టారు

మున్సిపాలిటీ ల్లో మురుగు, పారిశుధ్యం, డ్రెయి నేజీల నిర్వహణపై ఐదేళ్ల పాలన లో వైసీపీ ప్రభుత్వం కనీసంగా కూడా దృష్టిపెట్టిన పాపాన పోలేదు. పల్లపుప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతున్నా కన్నెత్తి చూడలేదు. గత ప్రభుత్వాలు ప్రారంభించిన వరద, మురు గునీటి కాల్వలను పాడుపెట్టారు. ప్రధాన కాల్వల్లో కనీసం పూడిక తీసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాల్వల్లో చెత్త పేరుకుపోయి వానలు కురిసినప్పుడు తీవ్ర దుర్గంధం వస్తు న్నా తమకు సంబంధం లేదన్నట్లుగా మున్సిపల్ అధికా రులు, పాలకులు వ్యవహరించారు. దీంతో దోమలు, దుర్వా సన, అంటువ్యాధులతో ప్రజలు అల్లాడిపోవడం పరిపాటిగా మారింది. ఏ మున్సిపాలిటీలోనూ రూపాయి నిధులు లేకుం డా ఊడ్చేసి ఖాళీ ఖజానాను వైసీపీ అప్పగించింది. బాపట్ల మున్సిపాలిటీనే దాదాపు రూ.11 కోట్ల లోటు బడ్జెట్‌తో ఉండడం మున్సిపాలిటీల దీనావస్థకు అద్దం పడు తోంది.

కాల్వల నిర్మాణాలు నై

చీరాలలోని బస్టాండ్ సెంటర్‌తో పాటు మార్కెట్ పరి సర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరు కుపోయి వర్షాల దెబ్బకి అదంతా కుళ్లి దుర్వా సన గుప్పుమంటోంది. జిల్లాలోని మూడు మున్సిపా లిటీల పరిధిలో గత ప్రభుత్వంలో నీటి కాల్వల నిర్మాణం కోసం దాదాపు రూ.15 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించగా ఐదేళ్లుగా అవేవీ పట్టాలెక్కకపోగా మున్సిపాలిటీల్లో ఉన్న నిధులన్నింటినీ దారి మళ్లించి వాటిని కునారిల్లేలా చేశారు.

బాపట్లలో రోడ్డు విస్తరణలో భాగంగా వైసీపీ నేతల ప్రాపకం కోసం దానిని ఇష్టారీతిన వంకర్లు తిప్పా రు. దీంతో మెయిన్ రోడ్డు మీదే నీళ్ల నిలబడి వాహనదారులకు, ప్రజలు నరకం చూస్తున్నారు. అరకొరగా చేపట్టిన రహదారుల విస్తరణలో భాగంగా పడ గొట్టిన మురుగుకాలువలను సైతం తిరిగి నిర్మించలేదు. దెబ్బతిన్న కాల్వలు పూడిపో యాయి. బాపట్ల చీలురోడ్డు సెంటర్ మొద లు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల వరకు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తు న్నాయి. రేపల్లె పరిధిలోని పాత స్టేట్‌బ్యాం కు రోడ్డులో రోడ్డు తటాకాన్ని తలపిస్తుంది.


● రేపల్లె : బసవేశ్వర థియేటర్ పక్క రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రేషన్ లొసుగులు బహిర్గతం


రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

- మంత్రి మనోహర్ తనిఖీల్లో వెలుగులోకి
- సరకుల పంపిణీ వాహనంలో కార్డుల గుట్టలపై ఆగ్రహం
- బియ్యం పంపిణీ కంటే నిల్వలే ఎక్కువపై నాదెండ్ల ఆశ్చర్యం
- వాహనాన్ని వదిలేసి పారిపోయిన ఓ ఎండీయూ ఆపరేటర్

తెనాలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీ వాహనంలోనే గుట్టలుగా కార్డులు.. పంపిణీ చేసిన వాటికంటే వాహ నంలో ఉన్న బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.. విక్రయ కేంద్రంలోనూ అదనపు బియ్యం మూటలు, ఇతర సరుకులు.. ఇవన్నీ ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల్లో బహిర్గతమైన విషయాలు. వీటిని చూసిన మంత్రి విస్తు పోయి, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్ప టికే రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపిన మంత్రి ఆదివారం తన సొంత నియోజకవర్గం లోనూ రేషన్ పంపిణీ తీరును ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మంత్రి తనిఖీల సమాచారం తెలుసుకున్న తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ కూడా పాల్గొన్నారు. మొదట బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజా ర్‌లో బియ్యం, కంది పప్పు దుకాణాన్ని పరి శీలించేందుకు మంత్రి వచ్చారు. అయితే ఒక దుకాణం మూసి ఉండటంతో ఆయన మండిపడ్డారు. పైగా సబ్‌కలెక్టర్ ప్రారంభిం చిన దుకాణం ఎలా ఉందనేది కూడా పరి శీలించరా అంటూ అధికారులపై మండి పడ్డారు. మరో దుకా ణంలో నాణ్యమైన బి య్యంతోపాటే తక్కువ రకం బియ్యం ఉండటాన్ని చూసి ప్రశ్నించారు. వ్యాపారి పొంతనలేని సమాధానంతో రెండు దుకాణాలపై విచారణకు ఆదేశించారు. రెండో దుకాణాన్ని మాత్రం సీజ్ చెయ్యాలని ఆదేశిం చారు. ఆ తర్వాత పినపాడు దగ్గర రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని గమనించిన మంత్రి అక్కడ ఆగారు.

సరుకులు పంపిణీ చేసిన పరిమాణాన్ని పరిశీలించారు. దానిలో పాత కార్డులతోనే రేషన్ పంపిణీ చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిని పరిశీలించాలని సబ్‌కలె క్టర్‌ను ఆదేశించారు. మఠంబజార్‌లో రోడ్డుప క్కన ఎండీయూ వాహనం ఉండటం, తలుపు లు తెరిచి ఉండటంతో దానిపై అనుమానం వచ్చి పరిశీలించారు. లోపల సంచిలో లబ్ధిదా రుల కార్డులు గుట్టలుగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ జరపాలని తహ సీల్దార్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. తనిఖీల సమాచారం తెలిసి ఆపరేటర్ వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లి ఉంటాడన్న కోణంలో పరిశీలించాలని తెలిపారు. మరో వాహనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రైతుబజార్‌లో కూర గాయల ధరలను పరిశీలించారు. అయితే బయట మార్కెట్‌లో కిలో టమోటా రూ.40 ధర ఉంటే, రైతు బజార్‌లో రూ.52కు అమ్మడంపై దుకాణదారుడ్ని, సూపర్‌వైజర్‌ను మంత్రి ప్రశ్నించారు. రిజిష్టర్‌ను పరిశీలించి వ్యత్యాసం ఉండటంతో పనితీరు సరిగాలేదని సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశించారు.


వాహనంలో రేషన్ కార్డుల గుట్టలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

నల్లమడ..ఆధునికీకరణ ఎప్పటికో?

- దశాబ్దాలుగా రైతులను పట్టిపీడిస్తున్న సమస్య
- వరద సమయంలో పెద్దఎత్తున ముంపుతో నష్టం
- వైసీపీ నేతల తవ్వకాలతో బలహీనంగా డ్రెయిన్ కట్టలు


జిల్లెళ్ళమూడి వద్ద బలహీనంగా ఉన్న నల్లమడ డ్రెయిన్ కట్ట

బాపట్ల, జూలై 14: ప్రభుత్వాలు మారుతున్నాయి.. నేతల హామీలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి.. కానీ నల్లమడ డ్రెయిన్ దుస్థితి మాత్రం మారడంలేదు. గండ్లు.. ముంపుతో బాపట్ల పరిసర ప్రాంత ప్రజలు, రైతుల పాలిట దుంఖదాయనిగా మారిన నల్లమడ డ్రెయిన్ దశా బ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. బాపట్ల మండలం సూర్యలంక స ముద్రతీరంలో కలిసే నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ కూటమి ప్రభు త్వంలో అయినా జరుగుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. తుఫా న్లు, భారీవర్షాల సమయంలో వరదలకు డ్రెయిన్ కట్టలు బలహీనంగా మారి గండ్లు పడటం, వేలాది ఎకరాలు ముంపునకు గురికావటం పరిపా టిగా మారుతోంది. బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామం వద్ద రెం డేళ్లకు ఒకసారి గండ్లు పడి పొలాలతోపాటు గ్రామాలు జలదిగ్బం ధంలో చిక్కుకుంటున్నాయి. రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న సమ యంలో నల్లమడ డ్రెయిన్ నష్టాన్ని పరిశీలించి ఆధునీక రణకు చర్యలు చేపడతామని హామీలు ఇచ్చారు. అయితే నామమాత్రపు పనులతో సమస్యను పూర్తి స్థా యిలో ఎవరూ పరిష్కరించలేదు. దీంతో ఎగువప్రాం తాల నుంచి వచ్చే వర్షపు నీరు అంతా నల్లమడలో ప్రవహించి దిగువ ప్రాంతమైన బాపట్ల మండలంలోని అనేక గ్రామాలు ముంపునకు కారణమౌతున్నది. ఏటా డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ఉన్న రైతులు ఎంతోకొంత పంట నష్టపోవాల్సి వస్తున్నది. దీనిపై నల్లమరైతు సంఘం నాయకు లు అనేక ఉద్యమాలు కూడా చేశారు. ప్రతిసారి కలెక్టర్‌కు వినతులు అందజేస్తూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో నల్లమడ అభివృద్ధి విషయం లో పూర్తి స్థాయి నిర్లక్ష్యం కనిపించింది. అప్పికట్ల, నందిరాజుతోట, పిన్నిబో యనవారిపాలెం గ్రామాల్లో డ్రెయిన్ కట్టలను వైసీపీ శ్రేణులు తవ్వి మట్టి, ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిపై నల్లమడరైతు సంఘం, బహుజనసమాజ్‌పార్టీవారు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకో లేదు. దీంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కట్టలు బల హీనపడి ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో డ్రెయిన్ పొంగితే సాగుకు ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


నల్లమడ కట్టలు తెగి ముంపునకు గురైన పొలాలు (పాతచిత్రం)

జిల్లెళ్ళమూడి ప్రాంతంలో మేటలు

బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామ సమీపంలో నల్లమడ డ్రెయిన్ అనేక మలుపులుగా ఉంటుంది. దీనివల్ల కాల్వ కట్టలు సైతం కరి గిపోయి మట్టికారి కాల్వలో మేటలు వేసింది. ఎండాకాలంలో మట్టి మేట లపై ముళ్ల మొక్కలు మొలిచి చెట్లుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఓవైపు మట్టి మేటలు, మరోవైపు ముళ్ళచెట్లకు తోడు బలహీ నంగా ఉన్న కట్టల వల్ల ఎప్పుడు ఏవిధమైన ముంపు సంభవిస్తుందోనని రైతులు భయపడుతున్నారు.



తీరప్రాంతంలో ఆక్వాసాగుకు అన్ని వసతులతో కూడిన 192 ఎక రాల్లో ఆక్వాపార్కు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి అన్నారు. ఆదివారం సూర్య లంక ఆదర్శనగర్ బ్రిడ్జి వద్ద నుంచి నిజాంపట్నం హార్బర్ వరకు బకిం గ్‌హాం కెనాల్‌లో 14 కిలోమీటర్ల మేర బోటులో కలెక్టర్ వెంకట మురళి, మత్స్యశాఖాధికారులు పర్యటించారు. నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను, సముద్రం ఒడ్డున మడ అడవులను, హార్బర్ అభి వృద్ధి పనులను పరిశీలించారు.



వలపర్లలోని గ్రావెల్ కొండ

ఎర్ర గ్రావెల్ ఉచితం

● ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు

● లోడింగ్, బాడుగ మాత్రమే కట్టాలి

● ఆనందం వ్యక్తం చేస్తున్న వలపర్ల గ్రామస్థులు

మార్టూరు, జూలై 14 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ప్రజలకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తుండగా, మండలంలోని వలపర్ల గ్రామస్థులకు ఎర్ర గ్రావెల్‌ను ఉచితంగా అందజేస్తోంది. ఎర్ర గ్రావెల్ కావాలంటే ప్రభుత్వానికి గాని, లీజుదారునికి గాని పైసా కూడా చెల్లించేపనిలేదు. గ్రామంలో ఎవరైనా ఎర్ర గ్రావెల్ అవసరమైన వారు ట్రాక్టరును బాడుగకు తీసుకొని పంచాయతీ పరిధిలోని ఎర్ర గ్రావెల్ కొండ దగ్గరకు వెళితే అక్కడ ఎక్స్‌కవేటర్‌తో మట్టిని ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తారు. అందుకు రూ.150 చెల్లించాలి. ట్రాక్టరుకు రూ.200 నుంచి రూ.400 బాడుగ అవుతుంది. గ్రావెల్‌కు మాత్రం పైసా కూడా వసూలు చేయడం లేదు. వలపర్ల గ్రామస్థులు ఉచితంగా గ్రావెల్‌ను తీసుకువెళుతున్నారు. గతంలో వైసీపీ హయాంలో ట్రాక్టరు గ్రావెల్ కావాలంటే రూ.1000 గ్రావెల్ క్వారీ నిర్వాహకునికి చెల్లించేవారు. కూటమి రాగానే జూన్ 5వ తేదీ నుంచి గ్రామంలో వైసీపీ నాయకుడు కొండ నుంచి ఎర్రగ్రావెల్ తవ్వకాలను నిలిపివేశారు. దాంతో ప్రస్తుతం గ్రావెల్ కొండపై ఎవరి పెత్తనం లేదు. దాంతో గ్రామస్థులు కొండ నుంచి గ్రావెల్‌ను ఉచితంగా తీసుకువెళుతున్నారు.



మార్కెట్ నుంచి తాండా వరకు వేసిన స్తంభాలు, ఎల్ఈడీలు

మార్టూరును తాకిన రాజధాని సొబగులు

» కొత్తగా విద్యుత్ స్తంభాలు.. ఎల్ఈడీ లైట్లతో కళకళ

» అభివృద్ధి పనులపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి

» స్పీడు పెంచిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, జూలై 14 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని అమరావతిలో పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా స్పీడ్ యాక్సిస్ రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో రాత్రిపూట కళ్లుజిగేల్ మంటూ వీధి లైట్లు కొత్తకాంతులను విరజిమ్ముతున్నాయి. మరి రాజధానిలో జోరందుకుంటున్న మార్పులు చేర్పుల ప్రభావమో, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుస్పీడుతోనో గాని మార్టూరు గ్రామ పంచాయతీలో కొన్ని పనులు వేగవంతమయ్యాయి. ముఖ్యంగా వాటిలో విద్యుత్ పనులు మాత్రము ఊపందుకున్నాయి. అందుకు నిదర్శనమే పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డు నుంచి రాజుగారిపాలెం రోడ్‌లో ఆర్‌జేఎస్‌టీ కాలనీ వరకు మూడవ విద్యుత్ లైనుతో కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలకు 100 ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. దాంతో ఈ రోడ్డులో రాత్రి ప్రయాణం వాహనదారులకు, ఆర్‌జేఎస్‌టీ కాలనీ వాసులకు పండు వెన్నెలలో ప్రయాణిస్తున్న మధురానుభూతిని అనుభవిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అదేవిధంగా హైవే సర్వీసు రోడ్ నుంచి అంటే కూరగాయల మార్కెట్ నుంచి లంబాడీ తాండా వరకు కొత్తగా స్తంభాలను, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి సమయంలో మార్టూరు సెంటర్‌కు, వివిధకారణాలతో ఇతర గ్రామాలకు వెళ్లి వచ్చే లంబాడీ వాసులకు పట్టపగలు వాతావరణంలో విద్యుత్ వెలుగులతో నిరభ్యంతరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాండాలకు చేరుకుంటున్నారు. గతంలో రాత్రి పూట ఆ రహదారిలో ప్రయాణం భయంభయంగా ఉండేదని వారు అనేవారు. గ్రామ పంచాయతీ నుంనుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు 4లక్షల 86వేల రూపాయలు జనవరిలో విద్యుత్ డిపార్టమెంట్‌కు చెల్లించారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. టీడీపీ రాగానే ఆగమేఘాలమీద స్తంభాలు వచ్చేశాయి. ఎల్ఈడీ లైట్ల కోసం జనరల్ ఫండ్స్ నుంచి రూ.4 లక్షలు కేటాయించారు. ఒక్కసారిగా లైట్లు వెలగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మార్టూరు సెంటర్‌లోనూ బయోలెట్రిన్స్

మార్టూరు సెంటరులో సులాభ్ కాంపెక్స్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వివిధ ప్రజా సంఘాలవారు, సీనియర్ సిటిజన్స్ ఎంతో కాలంగా అధికారులను కోరుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు ఎమ్మెల్యేగా ఏలూరి గెలవడంతో మార్టూరులోని ప్రజా సమస్యపై దృష్టిసారించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు గ్రామ పంచాయతీ నుంచి హైదరాబాద్‌కు చెందిన మోడరన్ మెటల్ ఫ్యాబ్రికేషన్ మాన్యుఫాక్చర్స్ కంపెనీకి రూ.10లక్షలు చెల్లించారు. దాంతో మార్టూరులో పెద్ద అండరుపాస్‌కు తూర్పువైపున ఖాళీ స్థలంలో రెండు కంటైనర్‌లో పురుషులకు 3, మహిళలకు 3 బయోలెట్రిన్స్‌ను ఏర్పాటు చేయడానికి కంపెనీ వారు అంగీకరించినట్లు తెలిసింది. ఈ బయో లెట్రిన్స్‌తో ఎంతో సౌలభ్యం కలిగే అవకాశం ఉంది

10 రోజుల్లో ఏర్పాటు చేస్తారు



ఎమ్మెల్యే ఏలూరి చొరవ తీసుకోవడంతో గ్రామ పంచాయతీ నుంచి కంపెనీకి 10లక్షల రూపాయలు చెల్లించాం. ఈ కంపెనీ వారు 10రోజులలో మార్టూరులో పెద్ద అండరు పాస్ వద్ద బయోలెట్రిన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారి హైవే అధికారులు శాశ్వత ప్రాతిపదికన సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదు. అందువలన బయోలెట్రిన్స్‌ను ఏర్పాటు చేయిస్తున్నాం.

- తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, మార్టూరు

లారీని ఢీకొన్న వ్యాన్

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



గాయపడ్డ దివ్యాంగుడు నాగేంద్రబాబు

అద్దంకి, జూలై 14 : మండలంలోని గోపాలపురం వద్ద అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డులో స్పీడు బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఆదివారం సాయంత్రం వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. చెన్నై నుంచి హుజూరానగర్ కు వెళ్తున్న వ్యాన్ ఆదివారం సాయంత్రం గోపాలపురం వచ్చే సరికి స్పీడు బ్రేకర్ వద్ద ముందు లారీ నిదానంగా వెళ్తోంది. ఈ సమయంలో వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్, దివ్యాంగుడై ఉండి జైపూర్ పుట్‌తో ఉన్న హుజూరానగర్ కు చెందిన నాగేంద్రబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వ్యాన్‌లో ఉన్న నవీన్, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గోపాలపురం వద్ద దశాబ్ద కాలంగా నామ్ రోడ్డు అసంపూర్తిగా వదిలివేయడం, అదే ప్రాంతంలో స్పీడు బ్రేకర్ ఉండడంతో వాహనాలు ఒక్కసారిగా స్పీడు తగ్గుతున్నాయి. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందు వెళ్లే వాహనాలను ఢీ కొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ రోడ్డు అసంపూర్తి గా ఉన్నట్లు, స్పీడు బ్రేకర్లు ఉన్నట్లు పెద్ద పెద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా మొక్కుబడిగా చిన్న బోర్డు ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలకు కారణం అవుతుందని పలువురు వాహనచోదకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా నామ్ అధికారులు ముందు నుంచే పెద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హైస్కూల్ ప్లస్ ఫెయిల్

పాఠాలు చెప్పేందుకు టీచర్లు కరువు

చదువుకునేందుకు పుస్తకాలు లేవు

ఆర్భాటంగా ప్రారంభించి

వదిలేసిన గత ప్రభుత్వం

అంతంతమాత్రంగానే అడ్మిషన్లు

ఫలితాల్లోనూ డీలా

బాలికా విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన హైస్కూలు ప్లస్ బాలికా జూనియర్ కళాశాలలు ఆచరణలో ఫెయిల్ అయ్యాయి. అధ్యాపకులను నియమించకపోవడం, పుస్తకాలను సకాలంలో పంపిణీ చేయకపోవడం, సౌకర్యాల కల్పనలో విఫలమవడంతో అవి తుస్సుమన్నాయి. జిల్లాలో ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లో తొమ్మిది బాలికా జూనియర్ కళాశాలలు కొనసాగుతుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా మరో 11 కోఎడ్యుకేషన్ కాలేజీలను ప్రారంభించారు. వాటిలో ప్రవేశాలకు విద్యార్థులు ససేమిరా అంటున్నారు. గత రెండేళ్లలో హైస్కూల్ ప్లస్‌లలో చదివిన విద్యార్థుల ఉత్తీర్ణత కూడా కేవలం 10నుంచి 26 శాతం మాత్రమే ఉంది. దీనికితోడు మొదటి సంవత్సరం ఫలితాల్లో ఐదు, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రెండు కాలేజీల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈనేపథ్యంలో వాటిలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు కూడా విముఖత చూపుతున్నారు. దీంతో అవి అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి.



బేస్తవారపేటలోని జడ్పీ పాఠశాల

ఒంగోలు (విద్య), జూలై 14 : బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పేరుతో బాలికా జూనియర్ కళాశాలలను ప్రారంభించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినులు పదో తరగతి పాసైన తర్వాత ఇంటర్, డిగ్రీల్లో చేరకుండా ఎక్కువ మంది చదువులకు స్వస్తి చెప్తున్నారు. ఈ పరిస్థితిని మార్చాలన్న ఉద్దేశంతో జడ్పీ హైస్కూళ్లలో బాలికా జూనియర్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. 2023లో జిల్లాలో తొలుత 13 హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించారు. వీటిలో నాలుగు కళాశాలలు బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లగా విభజిత జిల్లాలో తొమ్మిది కొనసాగుతున్నాయి.

11 కొత్త కళాశాలలు

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 11 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. గతంలో ఉన్నవన్నీ బాలికా జూనియర్ కళాశాలలు కావడంతో విద్యార్థులు ఆశించిన స్థాయిలో చేరలేదు. దీంతో కొత్తగా కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. నూతనంగా బేస్తవారపేట, ముండ్లపాడు, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, కొత్తపట్నం, కురిచేడు, పుల్లలచెరువు, సంతనూతలపాడు, తర్లుబాడు, పి.నాగులవరం, జరుగుమల్లిలో కళాశాలలు తెరిచింది. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఏదైనా రెండింటిని ఈ కళాశాలల హెచ్‌ఎంలు ఎంపిక చేసుకొని ప్రారంభించారు

చేరేందుకు విద్యార్థులు ససేమిరా

హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ససేమిరా అంటున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, మెడిసిన్ ఇతర ప్రొఫెషనల్ కోర్సుల వైపు దృష్టి సారించడం, హైస్కూల్ ప్లస్‌లలో బోధనకు సిబ్బంది లేకపోవడంతో ప్రవేశాలకు ముం దుకు రావడం లేదు. తల్లిదండ్రులు కూడా ప్రైవేటు, కార్పొరేట్ వైపు మొగ్గు చూపుతుండటంతో ఈ కళాశాలలు పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. ప్రవేశాల కోసం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మొక్కుబడిగా ప్రతి కళాశాలలో 10నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే చేరుతున్నారు.

పాఠాలు చెప్పేవారేరి

ఆర్భాటంగా కళాశాలలను ప్రారంభించిన గత ప్రభుత్వం అక్కడ బోధించేందుకు టీచర్లను నియమించలేదు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా టీచర్లు లేకపోవడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నేటికీ విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు అందలేదు. హైస్కూళ్లలో ఇప్పటికే స్కూలు అసిస్టెంట్లకు పనిభారం పెరిగి సతమతమవుతున్నారు. ఈనేపథ్యంలో హైస్కూల్ ప్లస్ తరగతులకు వెళ్లేందుకు వారు ఇష్టపడటం లేదు. కళాశాలలకు ప్రత్యేకంగా టీచర్లను నియమించకపోవడంతో పాఠాలు చెప్పేవారు కరువయ్యారు.

జూనియర్ కళాశాలల్లో ఫలితాలు అంతంతమాత్రమే

హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరీక్షా ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వీటిని ప్రారంభించిన 2023లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 13 కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 188 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది మాత్రమే పాసయ్యారు. ఐదు కళాశాలల్లో ఒక్కరు కూడా ఉత్తీర్ణులు కాలేదు. 2024 మార్చిలో జరిగిన పరీక్షలకు విభజిత అనంతర జిల్లాలోని తొమ్మిది కళాశాలల నుంచి 81 మంది పరీక్షకు హాజరు కాగా కేవలం 21 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రెండు కళాశాలల్లో ఒక్కరు కూడా పాస్ కాలేదు. 2024 మార్చిలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 9 కళాశాలల నుంచి 145 మంది పరీక్షకు హాజరు కాగా కేవలం 38 మంది మాత్రమే పాసయ్యారు. అవసరమైన సౌకర్యాల కల్పనలో గత ప్రభుత్వ వైఫల్యం ఈ కళాశాలలకు శాపంగా మారింది.

పంచాయతీలకు పరిపుష్టి

ఆర్థిక సంఘం నిధులు వెనక్కి

నేడోరేపో ఖాతాల్లో

రూ.40కోట్లు జమ

అడ్డగోలుగా హాంఫట్ చేసిన

గత వైసీపీ ప్రభుత్వం

పాలకవర్గాలను ఉత్సవ విగ్రహాలుగా

మార్చిన వైనం

పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి

సర్కారు చర్యలు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 14 : వైసీపీ పాలనలో ఐదేళ్లుగా నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చి పూర్వవైభవం తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకే ఇవ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో మంజూరై పంచాయతీలకు దక్కని 15వ ఆర్థిక సంఘం నాల్గో క్వార్టర్ నిధులను వెనక్కి ఇవ్వనుంది. ఈమేరకు వాటి ఖాతాలకు నేడోరేపు రూ.40 కోట్లు జమ చేయనుంది. ఈ నిధులతో గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా లాగేసుకుంది. పంచాయతీ ఖాతాలకు జమ చేసినట్లే చేసి ఆ వెంటనే హాంఫట్ చేసింది. దీంతో పంచాయతీల్లో పైసా నిధులు లేక పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగా ఉండిపోయాయి.



నాలుగో క్వార్టర్ నిధులు తిరిగి ఇవ్వాలని సీఎం నిర్ణయం

ఈనేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆశాఖపై సమీక్షలు నిర్వహించారు. అనేక లోటుపాట్లను గుర్తించారు. గ్రామ పంచాయతీల్లో ఏపని చేపట్టాలన్నా ఒక్క రూపాయి కూడా లేదన్న విషయాన్ని గుర్తించిన ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పంచాయతీలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా అడుగులు వేశారు. గత ప్రభుత్వంలో హాంఫట్ చేసిన వాటిలో 15వ ఆర్థిక సంఘం నాలుగో విడత నిధులను తిరిగి ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలోని 730 పంచాయతీల ఖాతాల్లో రూ.40కోట్లు జమకానున్నాయి.

పారిశుధ్యం, ఇతరత్రా పనులకు అవకాశం

ప్రస్తుతం జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు అత్యవసరమైన పనులు చేసే అవకాశం కలుగనుంది. జిల్లాలో గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఎన్నికై మూడున్నర సంవత్సరాలైనప్పటికీ నిధుల లేమితో సర్పంచ్‌లు ఏ ఒక్క పని కూడా చేయలేకపోయారు. గొప్పకోసం కొంత మంది అప్పులు చేసి పలు అభివృద్ధి పనులు చేసినా బిల్లులు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ప్రోత్సహించేలా ఆర్థిక సంఘం నిధులు ఇస్తుండటంతో పాలక వర్గాల్లో నూతనోత్సాహం నెలకొంది.



ఒంగోలు నగరంలో ఆదివారం సాయంత్రం కురుస్తున్న వర్షం

ముసురేసింది..!

● జిల్లా వ్యాప్తంగా వర్షం ● ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు

ఒంగోలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. మూడు రోజులుగా ఇంచుమించు అన్ని ప్రాంతాల్లో వాన కురుస్తోంది. కొన్నిచోట్ల భారీ వర్షం పడింది. అత్యధిక ప్రాంతాల్లో ఎడతెరిపిలేకుండా జల్లులు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఆదివారం ఉదయం వరకూ సుమారు 16మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఈ రెండు రోజుల్లో నాగులుప్పలపాడు, ఒంగోలు, సంతనూతలపాడు, మద్దిపాడు, పుల్లలచెరువు, చీమకుర్తి, టంగుటూరు. దోర్నాల, పైపాలెం, ముండ్లమూరు, కురిచేడు, గిద్దలూరు, కొమరోలు, వెలిగండ్ల, పీసీపల్లి తదితర మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం పగటిపూట కూడా జిల్లా అంతటా జల్లులు పడుతూనే ఉన్నాయి. ప్రత్యేకించి ఒంగోలు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో తెరపి లేకుండా చినుకులు పడుతుండగా సాయంత్రానికి కొన్ని చోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. ముసురుగా పడుతున్న వర్షం సాగుకు ఉపయుక్తమని రైతులు చెప్తున్నారు. ఇలా జల్లులు పడుతుండటం వల్ల భూమి బాగా నీరు తాగి పదునెక్కి ఖరీఫ్ సాగుకు సానుకూలంగా మారనుంది. ఇప్పటికే వేసిన పైర్లు కోలుకోనున్నాయి.

బీచ్ కబడ్డీ జట్లకు ప్రాబబుల్స్ ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు, గ్రామ పెద్దలు

చినగంజాం, జూలై 14 : సోపిరాల లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ (చెడుగుడు) స్త్రీ, పురుషుల జట్లకు ప్రాబబుల్స్‌ను ఆదివారం ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య తెలిపారు. జిల్లా పురుషుల జట్టు ఎంపికకు చీరాల, జాండ్రపేట, రాజుబంగారుపాలెం, చినగంజాం, చల్లారెడ్డిపాలెం, మూలగానిపాలెం ప్రాంతాలకు చెందిన 25 మంది క్రీడాకారులు వచ్చినట్లు తెలిపారు. వీరిలో ప్రతిభ కలిగిన 15 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహిళల జిల్లా జట్టుకు పాకల, సింగరాయకొండ, ఊళ్లపాలెంలకు 15 మంది క్రీడాకారలు రాగా వారిలో ఏడుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా పురుషుల జట్టుకు కోచ్ పుల్లయ్య పర్యవేక్షణలో ఈ నెల 15వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రామకోటేశ్వర స్వామి దేవస్థానంలో, ఎంపికైన జిల్లా మహిళా జట్టుకు పాకల సముద్రతీరంలో పీడీ హజ్‌రత్తయ్య పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన 6గురు పురుషుల క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన స్త్రీ, పురుషుల జట్లు ఆగస్టు 2వ తేదీ నుంచి నెల్లూరు జిల్లా ఇందకూరుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరుపున పాల్గొనన్నుట్లు పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిల్లర చంద్రశేఖరరావు, గంటా అంకమ్మ, ముంగర అప్పారావు, ఎం.సురేషు, గ్రామ పెద్దలు ఆళహరి రామచంద్రరావు, పర్వతరెడ్డి పద్మనాభయ్య, అనుమాలశెట్టి.శ్రీరామకృష్ణ, శిఖరం రామకృష్ణ, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు భోగిరెడ్డి స్వామిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

చంద్రబాబు, పవన్‌కల్యాణ్,

పలువురు నేతల

చిత్రపటాలకు పాలాభిషేకం



నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, టీడీపీ శ్రేణులు

అద్దంకి, జూలై 14 : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్‌ను రూ.6 వేలకు పెంచడం ద్వారా దివ్యాంగులకు మరింత ప్రయోజనం కలిగిందని దివ్యాంగుల ఆధ్వర్యంలో ఆదివారం పాతబస్టాండ్ సెంటర్‌లో పొట్టిశ్రీరాములు బొమ్మ వద్ద నేతల పోటోలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కలాణ్, ఎంఆర్పీఎస్ నేత మందా కృష్ణమాదిగ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫొటోలున్న ఫ్లెక్సీలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల అసోసియేషన్ నేతలు అప్పారావు, సుబ్రహ్మణ్యం, టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ నేతలు చిన్ని శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, గుంటూరు మాధవరావు, పూనూరి నరేంద్ర, బచ్చల వాసు, కోటయ్య, చక్రవర్తి, సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు.

మతబోధకుడిపై దాడి

వన్‌టౌన్ స్టేషన్‌లో పంచాయితీ

చీరాలటౌన్, జూలై 14 : చీరాల పట్టణం నడిబొడ్డు అయిన గడియార స్తంభం కూడలిలో క్రైస్తవ బోధకుడిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈఘటన శనివారం సాయంత్రం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఓ బోధకుడు అప్పుడప్పుడూ గడియార స్తంభం కూడలి వద్ద ప్లకార్డులతో ఒంటరిగా కొద్దిసేపు నిలబడి వెళ్లిపోతుంటాడు. ఈ క్రమంలోనే శనివారం కూడా నిలబడ్డాడు. అయితే అదే సమయంలో అటుగా కారులో వెళుతున్న పందిళ్లపల్లికి చెందిన వ్యక్తి కారులో నుంచి దిగి అతనిపై దాడికి పాల్పడి వెళ్లిపోతుండగా గమనించిన మరి కొందరు క్రిస్టియన్‌లు దాడికి పాల్పడిన వ్యక్తిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అక్కడ కొద్దిసేపు వివాదం నడిచింది. ఎట్టకేలకు పోలీసులు సర్ది చెప్పి రెండు వర్గాలను పంపించారు. అయితే ఇది కాస్త ఆదివారానికి సోషల్ మాధ్యమాల ద్వారా వైరల్ కావడంతో సోమవారం క్రిస్టియన్‌లు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

అలాగే ముంతావారి సెంటర్‌లో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి ఓ ఆటో వెనుక జీసస్ కొటేషన్ ఉండడంతో దానిని చించి పరారయ్యాడు. దీంతో విషయం పెద్దదయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

పలువురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ

మేదరమెట్ల, జూలై 14 : మేదరమెట్ల, కొరిశపాడు పోలీసుస్టేషన్ల పరిధిలోని ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కాన్‌స్టేబుల్‌గా పని చేస్తున్న జ్యోతి వెంకటేశ్వర్లు, అడవులదీవి స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కొరిశపాడు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న నాగశ్రీను బాపట్ల స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న గోపీకృష్ణ చీరాల స్టేషన్‌కు, కే.తిరుపాల్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలు ఈపురుపాలెం స్టేషన్‌కు, ఎం. అశోక్‌చక్రవర్తి చిన్నగంజాం పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

మేదరమెట్లలో నేత్రదానం

మేదరమెట్ల, జూలై 14 : మేదరమెట్లలో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో మొదటి నేత్రదానం జరిగింది. మేదరమెట్లకు చెందిన పశువైద్యశాఖ విశ్రాంత ఉద్యోగి శంకుల ప్రసాదలింగం (75) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యుల కోరిక మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య కార్యదర్శి మురళీసుధాకరరావులు శంకర కంటి ఆస్పత్రి వైద్యులు చిన్మయి బృందంతో వచ్చి కార్నియాలను సేకరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఇది 209వ నేత్రదానం. ఈ కార్యక్రమంలో ప్రసాదలింగం కుటుంబ సభ్యులతో పాటు మల్లాది శ్రీనివాసరావు, సామాజిక సేవకుడు రాచమల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం శిథిలం..!

- ఏడాదిగా చేరని ఒక్క విద్యార్థి
- ప్రాణాలకు రక్షణ లేదంటున్న తల్లిదండ్రులు
- పై కప్పు ఊడి పడుతుండడంపై ఆందోళన
- మూతపడిన వైదన హాస్టల్
- నాడు వందమందితో కళకళ.. నేడు వెలవెల
- మండల కేంద్రానికి తరలించి.. అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి


మూతపడిన సాంఘిక సంక్షేమ వసతి గృహం..గదిలో పడిపోతున్న పైకప్పు అచ్చులు..కూలిన ప్రహరీ గోడ

బల్లికురవ, జూలై 14 : ఒకప్పుడు వంద మంది విద్యార్థులతో కళకళలాడిన వైదన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నేడు శిథిలావస్థకు చేరి విద్యార్థులు లేక వెలవెలబోతుంది. కొంత కాలం నుంచి వసతి గృహం మరమ్మతులు చేయిస్తామని చెప్తున్న అధికారులు పట్టించుకోక పోవడంతో ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా వసతి గృహం వైపు కన్నెత్తి చూడకపోవడంతో పూర్తిగా మూత పడింది. ఈ వసతి గృహాన్ని బల్లికురవ మండల కేంద్రానికి తరలిస్తే మరలా విద్యార్థులతో కళకళ లాడుతుందని పలువురు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో 1989లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సుమారు 12 గదులతో ఎంతో అధునాతన వసతులతో ఒక అంతస్తు వేసి గదులను నిర్మాణం చేసి ప్రారంభించారు. వైదన గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాశాలల్లో చదివే విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండి ఉదయం సాయంత్రం తిరిగి పాఠశాలలకు వెళ్లేలా వసతులు ఏర్పాటు చేశారు. వంద మంది విద్యార్థులకు సరిపడా వసుతులు కల్పించారు. మెదట్లో విద్యార్థులతో ఎంతో కళకళలాడిన వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఎవరు హాస్టల్‌కు రాకపోవడంతో ఇప్పుడు విద్యార్థులు లేక మూత పడింది. గత ఏడాది 15 మంది విద్యార్థులతో పనిచేసిన వసతి గృహం ఈ ఏడాది మాత్రం విద్యార్థులు చేరకపోవడంతో పూర్తిస్థాయిలో అధికారులు మూసి వేశారు. వసతి గృహం పై కప్పు అచ్చులు ఊడి పడుతున్నాయని అలానే ప్రహరీ గోడ కూడా పడి పోయిందని మురుగు దొడ్లు కూడా సరిగా లేవని రాత్రి అయితే చుట్టూ ఉన్న ముళ్ల పొదల్లో నుంచి పాములు వస్తున్నాయని అందుకే తమ పిల్లలకు రక్షణ ఉండదని భయపడి వేరే ప్రాంతానికి తీసుకు వెళ్లి అక్కడ వసతి గృహంలో చేర్పించామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వైదన వసతి గృహం అందుబాటులో ఉంటే వలస పనులకు వెళ్లే బల్లికురవ మండల ప్రజలకు తమ పిల్లలను అక్కడ చేర్చి తమ పనులకు వెళ్లే సౌలాభ్యం ఉందని ఇప్పుడు వసతి గృహం మూసి వేయడంతో పలువురు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంతో పేరు ఉన్న వైదన వసతి గృహాన్ని మూసి వేయడం పట్ల కొందరు అధికార్ల తీరును తప్పు పడుతున్నారు. ఇంత కాలం నుంచి మరమ్మతులు చేయించ కుండా ఎమి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వసతి గృహానికి మరమ్మతులు చేసి విద్యార్థులకు ఉపయెగ పడేలా వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రానికి వసతి గృహాన్ని తరలిస్తే విద్యార్థుల వచ్చే అవకాశం వైదన గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బల్లికురవకు తరలిస్తే ఎక్కువ మంది విద్యార్థులు ఉపయెగించుకునే అవకాశం ఉందని పలువరు అంటున్నారు. బల్లికురవకు చుట్టుపక్కల ఎక్కువ గ్రామాలు దగ్గర దగ్గర ఉన్నాయని బల్లికురవలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని వారిలో కొందరు వసతి గృహంలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని తక్షణమే అధికారులు పరిశీలించి వెంటనే వసతి గృహాన్ని బల్లికురవలో ప్రాంభించే చర్యలు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.


పర్యాటకులను హెచ్చరిస్తున్న శివకుమార్

తీరంలో ఎస్ఐ గస్తీ

పర్యాటకులకు జాగ్రత్తలు చెప్తూ అప్రమత్తం

వాడరేవు(చీరాలటౌన్), జూలై 14 : ఒక వైపు వరుస మరణాలు, మరోవైపు వీకెండ్‌కు పోటెత్తిన పర్యాటకులు. దీంతో అదుపు చేసేందుకు ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ బెత్తం పట్టక తప్పలేదు. వివరాల్లోకి వెళితే.. చీరాల పరిధి లోని వాడరేవు, రామాపురానికి నిత్యం పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు. ఇక వారాంతమైతే చెప్పనవసరం లేదు. సముద్రతీరంలో పర్యాటకులతో సందడి సందడిగా ఉంటుంది. ఇటీవల పెద్ద సంఖ్యలో యువకులు మృత్యువాత పడడంతో జిల్లా స్థాయి అధికారులు, పాలకులు ఆదేశాలతో కొద్దిరోజులు సముద్రంలోకి నిషేధాజ్ఞలు విధించారు. కానీ దూర సుదూర ప్రాంతాల నుంచి పర్యాకుటులు వచ్చి అసంతృప్తితో తిరిగి వెళ్లిపోయారు. ఇదే సమయంలో అధికారులు పటిష్ట జాగ్రత్తలు చేపట్టి గత రెండు రోజుల నుంచి అనుమతులు కొనసాగించారు. ఈక్రమంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పిల్ల జెల్లా తేడా లేకుండా సముద్రంలోకి దిగి ఆనందించారు. దీంతో గత పరిస్థితులు కొనసాగకుండా ఉండేందుకు, ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎస్సై బెత్తం పట్టక తప్పలేదు. తమదైన శైలిలో విధులు నిర్వహిస్తూ ఆదివారం సుఖాంతం చేశారు. ఆయన వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ తీగలు చోరీ


వేటపాలెం, సంతరావూరు మధ్య పొలాల్లో కత్తిరించిన తీగలు

వేటపాలెం(చీరాల), జూలై 14 : వేటపాలెం, సంతరావూరు మధ్య వారాట పొలాల్లో బొబ్బర్లదిబ్బ వద్ద సుమారు ఏడు విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు చోరీకి గురైనట్లు రైతులు ఆదివారం విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దిబ్బ పొలాలు సుమారు 200 ఎకరాలు ఉంటాయి. వాటికి నీరు అందించేందుకు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందుకు సంబంధించిన విద్యుత్ లైన్‌లోని తీగలను దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు. గతంలో కూడా దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగను దొంగలించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

బాలుడి కిడ్నాప్ అవాస్తవం

మార్టూరు, జూలై 14: మార్టూరు గ్రామంలో శనివారం కరణం మన్నస్ అనే 10 ఏళ్ల బాలుడ్ని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారన్న సంఘటన పూర్తిగా అవాస్తవమని సీఐ రాజశేఖర్ రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లిన మన్నస్ 40 నిమిషాల తర్వాత ఇంటికి వచ్చారన్నారు. అయితే అప్పటిదాకా ఎక్కడకు వెళ్లావని తల్లి తండ్రులు కొడతారని భయపడిన మన్నస్ తనను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించగా తప్పించుకొని వచ్చానని తల్లి తండ్రులకు చెప్పాడన్నారు. తమ విచారణలో అది తేలిందన్నారు.

అమ్మ ఆశ్రమానికి ఆర్థిక సాయం

మార్టూరు, జూలై 14 : అమ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నల్లమోతు మధు తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.25 వేల రూపాయల సాయం అందచేశారు. ఆయన ఆదివారం నగదును మార్టూరులో నివసిస్తున్న తాత రాములు ద్వారా ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు.

కోలలపూడిలో ద్విచక్రవాహనం దగ్ధం

మార్టూరు, జూలై 14 : కోలలపూడి గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుంచెపు పెద్దబ్బాయి అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనాన్ని పెట్రోలు పోసి దగ్ధం చేసినట్లు తెలిసింది. రూ.లక్ష విలువైన హోండా షైన్‌ను ఇంటి ముందు ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. కొంత సేపటి తర్వాత ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంటిలో ఉన్న పెద్దబ్బాయికి సెల్‌ఫోన్‌లో చెప్పారు. దాంతో అతను బయటకు వచ్చి చూడగా అప్పటికే బైక్ తగులబడింది. దీనిపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సాదినేని నరసింహారావు, హనుమంతరావుతో తనకు ఇంటి గోడ నిర్మాణ విషయమై గొడవ జరిగిందని, తన బైక్ దగ్ధం విషయంలో వారిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

పంగులూరు, జూలై 14 : అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటన ముప్పవరం, పంగులూరు రోడ్డులో జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో కారు కొంతభాగం దెబ్బతినగా ప్రయాణిస్తున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. పంగులూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గన్నవరపు కోటేశ్వరరావు తన ఇంటికి వచ్చిన బంధువులను ముప్పవరంలో బస్సు ఎక్కించేందుకు కారులో బయలుదేరారు. ముప్పవరంలో బంధువులను బస్సు ఎక్కించిన అనంతరం తిరుగు ప్రయాణంలో పంగులూరు వస్తుండగా సంఘం డెయిరీ వద్దకు రాగానే కారు అదుపు తప్పి ఎదురుగా ఉన్న స్తంబాన్ని ఢీకొని బోల్తా కొట్టింది. కారు నడుపుతున్న కోటేశ్వరరావు ఎలాంటి గాయలు లేకుండా క్షేమంగా బయటపడగా, కారు కొంత భాగం దెబ్బతిన్నది.

దుండగులను కఠినంగా శిక్షించాలి

అద్దంకి, జూలై 14 : తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఆర్మ్ స్ట్రాంగ్‌ను దుండగలు ఇంట్లోకి ప్రవేశించి హత్య చేయడం దారుణం అని, దుండగులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు మందా జోషఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్ లో ఆర్మ్ స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కా కాంతారావు, జ్యోతి రమేష్‌బాబు, పులిపాటి హేబేలు, పూనూరి నరేం ద్ర, మంచు హనుమంతరావు,రోషన్‌బాబు, నంబూరి రోశయ్య పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న వైద్యులు

140 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఇంకొల్లు, జూలై 14 : మండలంలోని గంగవరంలో మంచాల వెంకటరామయ్య రంగమ్మ కల్యాణ మండపంలో గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సాంబయ్య వైద్య పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు. గ్రామానికి చెందిన కరి రామయ్య స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు 140 మంది రోగులకు కేవలం రూ.200కే నెలకు సరిపడా మందులు అందజేసేందుకు ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు అభినందించారు. ఈ శిబిరంలో క్యాంపు కన్వీనర్ కరి బాలచంద్రం, కందిమళ్ల రామకోటేశ్వరరావు, కరి కమలేశ్వరరావు, సుబ్బారావు, జగన్నాథం, జ్యోతి సహకరించారు.

నీటి వృథాపై ప్రజల ఆగ్రహం


పర్చూరు - కారంచేడు మధ్య పైప్ లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

పర్చూరు, జూలై 14 : ఓ పక్క నీటి ఎద్దడి.. మరో పక్క అడుగంటిన చెరువులతో నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఉన్న కొద్దిపాటి నీరు ఇలా వృథాగా కాలువల పాలు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నీరు వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా నీటి కష్టాలు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. కొమ్మమూరు కాలువ నుంచి నాలుగు కోట్ల పైపలైన్ ద్వారా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం పైపు లైనుకు చేరే నీరు ఇలా వృథాగా పోవడమే ఇందుకు నిదర్శనం. ఈదృశ్యం ఆదివారం కారంచేడు - పర్చూరు మధ్య కన్పించింది.

నేతన్నల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

- ఎమ్మెల్యే కొండయ్య
- ఘనంగా సన్మానించిన మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


ఎమ్మెల్యే కొండయ్యకు వినతిని ఇస్తున్న మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ ప్రతినిధులు

చీరాల, జూలై 14 : సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో చేనేత రంగానికి సంబంధించి మాస్టర్ వీవర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు, చేనేత, జౌళి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండల పరిధిలోని జాండ్రపేటలో ఆదివారం దేవాంగ కల్యాణ మండపంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండయ్యను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నేతన్నలకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు పలువురు మాస్టర్ వీవర్లు నియోజవకర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన వస్త్రాల నిల్వలు కొనుగోళ్లు జరగక పేరుకు పోయాయని వివరించారు. ఆ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కొండయ్య వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిద్ధి బుచ్చేశ్వరరావు, గుంటి ఆంజనేయులు, బట్ట శ్రీను, గుంటి వెంకయ్య, బట్ట సురేష్, పసుమర్తి మల్లికార్జున, బి. భాస్కర్, వి.రాజ, సజ్జా లెనిన్, బట్ట రాంబాబు, సుబ్రమణ్యం, ప్రసాద్, హరికృష్ణ, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ

తెల్లగాంధీ బొమ్మ సమీపంలోని భావనా రుషి స్వామి వారి ఆలయంలో ఆదివారం పద్మశాలీయ బహుత్తమ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను కొండయ్య అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడిలో పూజలు

మండల పరిధిలోని తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి గుడి వద్ద ఆదివారం నిర్వహించిన కొలుపులు కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కొండయ్య అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నీ గుంతలే..!

- అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


భవానీ సెంటర్‌లో దర్శి రోడ్డు వైపు ఏర్పడ్డ గోతులు

అద్దంకి, జూలై 14 : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో గోతులతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో గోతులలో నీరు నిలిచి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి దర్శి రోడ్డు ప్రారంభం అవుతుంది. దర్శి రోడ్డు ప్రారంభంలో వాహనాల వేగనిరోధానికి స్పీడు బ్రేకర్ ఉంది. అక్కడే పెద్ద గోతులు పడ్డాయి. ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుగా ఉన్న దర్శి రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, అదీ నిత్యం రద్దీగా ఉండే భవానీ సెంటర్ అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటం విమర్శలకు తావిస్తుంది. ప్రధానంగా అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో సైడ్ డ్రైన్‌లు సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు సులువుగా ప్రయాణించే వీలు లేక తారు రోడ్డు మీద నిలిచి తరచూ గోతులుగా మారుతున్నాయి. నామ్ రోడ్డు, దర్శి రోడ్డు కలిసే కూడలి ప్రాంతంలో సీసీ రోడ్డుగా మార్చాల్సిన అవసరం ఉంది. గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

పంగులూరు : మండల కేంద్రమైన పంగులూరు ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడవుతుంది. కొద్దిపాటి వర్షం పడినా ప్రధాన కూడలిలో రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచి మడుగును తలపిస్తుంది. నీరు నిలిచి బురదమయమవుతున్న రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే వాహనాల వేగానికి చింది పడే నీటితో రోడ్డు ప్రక్కన నడిచే వారు ఇబ్బంది పడుతున్నారు. బస్సులు నిలిచే ఈ ప్రదేశంలో ప్రయాణికులు వాహనం ఎక్కాలన్నా, దిగాలన్నా తీవ్ర యిబ్బందులు పడుతున్నారు. రెండున్నర దశాబ్దాల కిందట ప్రధాన రహదారిలో నిర్మితమైన సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు లేకపోవడంతో వర్షపు నీరు రోజుల తరబడి రోడ్డుకు ఇరువైపులా నిలిచి మురుగును తలపిస్తుంది. ఇదే రోడ్డులో పలు చోట్ల ఏర్పడిన గోతులు రాకపోకలకు అంతరాయంగా ఉంది. మండల కేంద్రం కావడంతో పలు గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించడం, వాహనాల రద్దీ అధికంగా ఉండటం, ప్రధాన కూడలిలో ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాల మధ్య పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకుంది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి గుంతలకు మరమ్మత్తులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ఉప్పలపాడులో రోడ్డు దుస్థితి .. పంగులూరులో రోడ్డుపై నిలిచిన నీరు

నాంచారమ్మకు ఆషాడ సారె బహూకరణ


అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

పర్చూరు, జూలై 14 : పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఆదివారం ఆషాడమాసం సారెను బహూకరించారు. ఆషాడ తొలి ఏకాదశకు ముందు అమ్మవారికి సారెను ఇవ్వడం ఆనవాయితీ. ఏటా ఇలా అమ్మవారికి పసుపుకుంకుమ, సారె ఇవ్వడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని, ధన, ధాన్యాలు, స్త్రీలకు సౌభాగ్యం, పంటలు సుభిక్షంగా పండుతాయని భక్తుల నమ్మకం. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఒగ్గిశెట్టి శివనాగ ప్రసాద్ నేతృత్వంలో మహిళా భక్తులు కోలాటం, భజనలు, మేళా తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సారెను సమర్పించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కోటిరెడ్డి, వంశంపారంపర్య అర్చకులు తులసి వారు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెంవాసిగా గుర్తింపు

అద్దంకి, జూలై 14 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన పసుపులేటి నాయుడు(58)గా గుర్తించారు. నాయుడు శుక్రవారం బేల్దారి పని కోసం అద్దంకి వచ్చి రాత్రి 10 గంటల సమయంలో భవానీ సెంటర్ నుంచి తిమ్మాయపాలెం నడిచివెళ్తుండగా భవనాసి కాలువ సమీపంలో గుర్తు తెలియని ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నాయుడును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరా త్రి మృతి చెందారు. అయితే వివరాలు తెలియకపోడంతో ఒంగోలు రిమ్స్ అవుట్ పోస్టులో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. ఆదివారం భార్య మస్తానమ్మ ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.





సోమశిలలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు,చిత్రంలో జిల్లా మంత్రులు, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

ఐదేళ్లలో 'ఇరిగేషన్' విధ్వంసం

- సోమశిల డ్యాం కొట్టుకుపోయేలా చేశారు..
- క్రస్టుగేట్ల వ్యవస్థ అధ్వానం
- రెండు నెలల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం..
- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల



సోమశిల జలాశయం ముందు దెబ్బతిన్న ఆప్రాన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం, నారాయణ

అనంతసాగరం, జూలై 14: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్‌శాఖను విధ్వంసం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆదివారం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి ఆయన సోమశిల జలాశయాన్ని సందర్శించారు. తొలుత అతిథిగృహంలో ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి లోపాలు తెలుసుకున్నారు. అనంతరం ఆగిన ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ నిర్మాణాలను పరిశీలించారు. తదుపరి జలాశయం ముందు దెబ్బతిన్న ఆప్రాన్ చూసి నివ్వెరపోయారు.గతంలో వచ్చిన వరదలకు ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఫొటో ప్రదర్శన ద్వారా సోమశిల ఎగువ, దిగువ ఉన్నా జలాశయాలు, డ్యాంకు నీటిలభ్యత చేకూరే విషయాలను వారు అమాత్యులకు తెలియజేశారు.

అనంతరం మంత్రి నిమ్మల విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్ విధ్వంస పాలన సాగించి, సాగునీటి రంగాన్ని పాతాళానికి నెట్టేశారని దుయ్యబట్టారు. సోమశిలలో ఆప్రాన్ పనులు అత్యవ సరంగా చేయాల్సి ఉంటే, వాటి గురించి పట్టించుకోక పోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయే పరిస్థితి తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులపై అవగాహన లేని వ్యక్తులను మంత్రులుగా నియమించాడని పేర్కొన్నారు. సోమశిల డ్యాం పటిష్టత గురించి పట్టించుకోకపోవడంతో క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. 2014 టీడీపీ హయాంలో ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పనులపై చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపి నిధులు కేటాయించి పనులు పురోగతిలో సాగేలా చేశారని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులు విస్మరించి రీటెండరింగ్ పేరిట కాలయాపన చేసిందని విమర్శించారు.

● రెండు నెలల్లో ఆప్రాన్ పనులు

సోమశిల ఆప్రాన్ పనులకు 60 రోజుల ప్రణాళిక రూపొందించి, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల తెలిపారు. డ్యాం వద్ద ధ్వంసమైన సోమేశ్వరుడి ఆలయానికి కూడా పూర్వవైభవం తెచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాశిం సునీల్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు, ఎస్ఈ వెంకటరమణరెడ్డి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్ఐ ఓవరాక్షన్

మంత్రుల రాక సందర్భంగా డ్యామ్ వద్ద బందోబస్తు నిర్వహించిన అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి ఓవరాక్షన్ చేశారు. మంత్రులు డ్యామ్‌పైకి రాకముందే కొంతమంది విలేకర్లు వెళ్తుండగా వారిని అడ్డుకున్నారు. అంతేకాక మంత్రి నిమ్మల రామనాయుడు కారును కూడా ఆపారు. మంత్రి మరో వాహనంలో వెళ్లారని, కారును అనుమంతించాలని సిబ్బంది కోరినా ఆయన స్పందించ లేదు. కందుకూరు ఎమ్మెల్యే కారును కూడా ఆపడంతో ఎస్ఐ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు మంత్రి ఆనం వ్యక్తిగత సిబ్బంది వాహనాలను కూడా అడ్డుకున్నారు. తాము ఫలానా అని చెప్పినా వినిపించుకోని ఎస్ఐ తీరును పలువురు బహిరంగంగానే ఖండించారు.

సాగు,తాగు నీరందించిన ఘనత టీడీపీదే !

- మంత్రి నిమ్మల రామానాయుడు

రాపూరు(డక్కిలి), జూలై 14 : ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించిన ఘనత టీడీపీదేనని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం ఆయన కండలేరు జలాశయాన్ని సందించారు. అనంతరం కండలేరు అతిథిగృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుగంగ, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ను ప్రారంభించి, విజయవంతంగా పూర్తిచేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌దేనన్నారు. నేడు జిల్లాలో సాగు, తాగునీటికి కొరత లేకపోవడానికి ఎన్టీఆర్, చంద్రబాబుల కృషే కారణమన్నారు.

● ఆయన చేసిందేమీ లేదు..

జిల్లాలో జలవనురుల శాఖమంత్రిగా పనిచేసిన ఒకాయన జిల్లాకు ఇరిగేషన్‌పరంగా చేసింది శూన్యమన్నారు. బుల్లెట్లు దింపడం తప్ప. గుక్కెడు నీళ్లు ఇచ్చిందిలేదని దుయ్యబట్టారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. ఏ రైతు నష్టపోకుండా ప్రతి ఎకరానికి నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని చెప్పారు. జగన్ చేతగానితనంతో అన్నమయ్య ప్రాజెక్టు ఆనకట్ట కొట్టుకుపోయిందన్నారు. సోమశిల కూడా కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కండలేరులో దెబ్బతిన్న పనులకు రూ.16 కోట్లు వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. తెలుగుగంగ హైలెవల్ కెనాల్స్ ను కూడా పరిశీలించామన్నారు. వాటి మరమ్మతులకు అవసరమైన సూచనలు కూడా ఇంజనీర్లకు ఇచ్చామన్నారు. లష్కర్లకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించడంతోపాటు వారిని విధుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నామని నిమ్మల చెప్పారు. ముంపు గ్రామాలకు నుంచి వచ్చే అర్జీలను ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్, విజయశ్రీ, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, జిల్లా కలెక్టరు ఆనంద్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కండలేరు జలాశయ అతిథి గృహంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల, చిత్రంలో ఆనం, నారాయణ తదితరులు

- జిల్లాలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- రోజుకో హత్యాయత్నం... రెండురోజులకో హత్య
- రౌడీషీటర్లు, పాత నేరస్థులతోనే అరాచకాలు
- పంచాయితీ కేంద్రాలుగా పోలీసుస్టేషన్లు
- నగరంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలే...
- అవినీతికి కేరాఫ్‌గా సెబ్
- ఎస్‌బి ప్రక్షాళనకు అడుగులు పడేనా ?
- నేడు కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ
- కృష్ణకాంత్‌పైనే జిల్లా వాసుల ఆశలు

కృష్ణా... మము కావవా ?



ప్రశాంతతకు మారుపేరుగా నెల్లూరు జిల్లా పేరుగాంచింది. అందుకనే ఈ జిల్లాలో జీవించాలని దేశంలోని ఎంతోమంది కోరుకుంటారు. ఓ ఇల్లో.. స్థలమో కొనిపెట్టుకుని జీవిత చరమాంకంలో ప్రశాంతంగా ఇక్కడ ఉండాలనుకుంటారు... అయితే ఇదంతా గతం... కొన్నేళ్లుగా జిల్లా అశాంతికి అడ్డాగా మారిపోయింది. రోజుకో హత్యాయత్నం, రెండు రోజులకొక హత్య... నిత్యం, గొడవలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, వేధింపులు... ఇలా నేరాలకు, ఘోరాలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)గా కృష్ణకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో శాంతిభద్రతలను ఆయనైనా గాడిన పెడతారని, జిల్లాకు పూర్వవైభవం తీసుకువస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

\- నెల్లూరు(క్రైం)

గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అండదండలతో రౌడీషీటర్లు పోలీసుస్టేషన్లలో కూర్చొని పంచాయితీలు చేసే స్థాయికి చేరుకున్నారు. పోలీసుఅధికారులు సైతం నాయకుల మన్ననలు పొందేందుకు రౌడీషీటర్లు చెప్పిందే వేదం అంటూ అడుగులు వేసేవారు. ప్రభుత్వం మారినా వారి తీరులో పెద్దగా మార్పు కనిపించడం లేదు. జిల్లాలో హత్యలు, హత్యాయత్నాల కేసుల్లో నిందితులు ఎక్కువగా రౌడీషీటర్లు, పాత నేరస్థులే ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో నేరం చేసి జైలుశిక్ష అనుభవించిన వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచేవారు. జైలు నుంచి బయటకు వచ్చినవారు ఎక్కడున్నారు...ఏం చేస్తున్నారు...? వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచేవారు. అయితే ఇప్పుడు అలాంటివేమీ కనిపించడం లేదు.

● కత్తులతో తిరుగుతున్నా..

జిల్లాలోని నేరచరితులకు పోలీసులంటే పూర్తిగా భయంపోయింది. జేబుల్లో కత్తులు, బ్లేడులు పెట్టుకొని తిరగడం ప్రస్తుతం వారికి ఫ్యాషన్‌గా మారిపోయింది. నెల్లూరు నగరంలో మద్యం కోసం నగదు ఇవ్వకపోతే కత్తులతో బెదిరించడం, దాడి చేయడం, చివరకు హత్య చేయడం చేస్తున్నారు. చిన్నచిన్న కారణాలతో వెంటాడి ప్రాణాలు తీస్తున్నారు. జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కుటుంబసమేతంగా ఒంటరిగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. మాదక ద్రవ్యాల వాడకం విచ్చలవిడిగా పెరిగింది. గంజాయికి అడ్డాగా మారిపోయింది. డ్రగ్స్‌ను సైతం ఇటీవల పోలీసులు పట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇక పేకాట,వ్యభిచారాలకు జిల్లాలో అడ్డూఅదుపూ లేదు. జిల్లాలోని కొందరు పోలీసు అధికారులే నెలవారీమామూళ్లు తీసుకొని వీటికి అండగా ఉంటున్నట్లు సమాచారం.

ట్రాఫిక్ కష్టాలకు తీరేనా ?

నెల్లూరు నగరంలో ప్రజలు నిరంతరం ఎదుర్కొనే అతి పెద్ద సమస్య ట్రాఫిక్. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం, మాటలకే పరిమితమైన సిగ్నల్ వ్యవస్థ, అక్రమంగా ఆటో స్టాండ్లు, ఇష్టానుసారంగా తిరిగే సిటీ బస్సులు, వేల కొద్ది ఆటోలతో నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకి జఠిలమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడం ఇటు నాయకుల వల్ల, అటు అధికారుల వల్ల కావడం లేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టే జిల్లా ఎస్పీ అయినా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

● స్టేషన్లలో మర్యాద కరువు

పోలీసుస్టేషన్లలో పోలీసులు ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని పలు సమావేశాల్లో పోలీసు అధికారులు పదే పదే చెబుతుంటారు. అయితే జిల్లాలోని స్టేషన్లలో అడుగు పెట్టాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంఘటనలు ఎన్నో ఉన్నాయి. విచారణ సమయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. స్టేషన్‌లో అడుగుపెడితే రూ. 5వేలు వదిలించుకో వాల్సిందేనన్న రీతిలో జిల్లాలోని పోలీసుస్టేషన్లు ఉన్నాయి.

● అవినీతి ఆరోపణలతో సెబ్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను రెండు విభాగాలుగా చేసి సెబ్‌ను ఏర్పాటు చేశారు. సెబ్ పర్యవేక్షణ సైతం పోలీస్ బాస్ పైనే ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం సెబ్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ, మైనింగ్, అధిక మద్యం తరలించడం.. ఇలా అన్నింటిలోనూ సెబ్ అధికారులు నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి అడ్డుపడేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

● ఎస్‌బీ ప్రక్షాళనకు అడుగులు పడేనా ?

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్యూరో (ఎస్‌బీ) సిబ్బంది మొత్తం ఇప్పటివరకు వైసీపీ నాయకుల కనుసైగల్లో నడుస్తుండేవారు. ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా ఎస్‌బీలో మాత్రం పెద్దగా ప్రక్షాళన జరిపేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కృష్ణకాంత్ అయినా ఎస్‌బీ ప్రక్షాళన వైపు అడుగులు వేస్తారో లేదో చూడాలి.

● ఏళ్ల తరబడి అక్కడే... !

ఇక జిల్లావ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లను అడ్డాగా చేసుకొని నాన్ యూనిఫాంలో ఉన్న సిబ్బంది అంతా అక్కడే పాతుకుపోయారు. వారికి బదిలీలు ఉండవు.ఒకవేళ బదిలీలు చేసినా మళ్లీ అదే స్టేషన్లకు సిఫార్సుల ద్వారా చేరిపోతున్నారు. ఇలాంటి వారు పోలీసుశాఖలోని పలు విభాగాల్లో పాతుకుపోయి ఉన్నారు. వారిపై సైతం ఎస్పీ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న జిల్లా పోలీసు బాస్‌పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు.



రొట్టెల పండుగకు ముస్తాబైన బారాషహీద్ దర్గా

బారాషహీద్ దర్గాకు పండుగ కళ

- తరలివస్తున్న ప్రజానీకం
- స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు
- రొట్టె పట్టి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14: నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాకు పండుగ కళ వచ్చింది. విశేషంగా జరిగే రొట్టెల పండుగ ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్నది. అయితే ఆదివారం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఇప్పటికే దేశం నలుమూలల నుంచేకాక విదేశాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు. భక్తులు ముందుగా స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద పవిత్ర స్నానాలు చేసి కోర్కెల రొట్టెను పట్టుకుంటున్నారు. అనంతరం దర్గాలో బారాషహీద్‌లకు పూజలు చేసి మొక్కు చెల్లించుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంఅంతా జనంతో నిండిపోయింది. పండుగ ఏర్పాట్లలో భాగంగా దర్గా మైదానం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల దీపాలంకరణలతో దర్గా కళకళలాడుతోంది. దర్గా మైదానంలో వేలాది అంగళ్లు ప్రారంభమయ్యాయి. వస్త్రాలు, కొబ్బరికాయలు, ఫుడ్‌కోర్టులు, వివిధ రకాల సామాన్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. దుకాణాల్లో మహిళలకు సంబంధించిన వంటసామగ్రి, గాజులు, రకరకాల బొమ్మలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే రెయిన్ కోట్లు, ట్రావెల్ బ్యాగులు తదితర షాపులతో మైదానం కళకళలాడుతోంది. ఆదివారం ఉదయం నుంచి వర్షం కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగకు మూడు రోజుల ముందే భక్తులు భారీ సంఖ్యలో రావడంతో వారికి సౌకర్యాలు కోసం మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. నగరంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల్లో యాత్రికులకు వసతులు కల్పించారు. దర్గా కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు దర్గా మైదానంలో పర్యటిస్తూ భక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు



దర్గా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆధ్యాత్మిక కేంద్రంగా బారాషహీద్ దర్గా

- దర్గా కమిటీ ప్రమాణ స్వీకార సభలో మంత్రులు

ఆధ్యాత్మిక కేంద్రంగా బారాషహీద్ దర్గాను తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి బారాషహీద్ దర్గా వద్ద దర్గా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అనంతరం జరిగిన సభలో మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ రొట్టెల పండుగకు ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నదని తెలిపారు. గతంలో ఒక్కరోజు జరిగే ఈ పండుగ ప్రస్తుతం ఏడు రోజులకు చేరిందని తెలిపారు. దర్గాలో పెద్ద మసీదు నిర్మాణాన్ని కూడా రానున్న ఐదేళ్లలో పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో కోటి మంది భక్తులు హాజరయ్యేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గతంలో తాను మున్సిపల్ శాఖామంత్రిగా ఉన్నప్పుడు భక్తుల కోరిక మేరకు స్వర్ణాల ఘాట్ నిర్మాణం, శాశ్వత మరుగుదొడ్లు, వసతిగృహాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తితో భక్తులకు సేవలు అందిస్తే దేవుడి ఆశీస్సులు అందరికీ లభిస్తాయన్నారు. మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రొట్టెల పండుగకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రజలందరికీ రొట్టెల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం దర్గా కమిటీ అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి 70 మంది కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, టీడీపీ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, నాయకులు సయ్యద్ సమీ, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



దర్గా కమిటీ చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న ఖాదర్‌బాషా

గ్రామాల్లోకి వన్యప్రాణులు

● అటవీ ప్రాంతాల్లో నీటి కొరత ● దాహార్తితో జనావాసాల్లోకి పరుగులు
● కుక్కలబారిన పడి మృత్యువాత ● పట్టించుకోని అధికారులు


ఉదయగిరి బీసీ కాలనీలోకి వచ్చిన దుప్పిని రక్షించిన స్థానికులు (ఫైల్)

ఉదయగిరి, జూలై 14: స్థానిక రేంజ్ పరిధిలోని వన్యప్రాణులు గ్రామాల వైపు పరుగులు తీస్తున్నాయి. అటవీప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడి దాహార్తి తీర్చుకునేందుకు శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. వీటిని గమనించిన ఊరకుక్కలు వెంటపడడంతో కొన్ని తప్పించుకొని అడవుల్లోకి పారిపోతున్నాయి. మరికొన్ని వీటి బారినపడి గాయాలు పాలై మృత్యువాత పడుతున్నాయి. ఇంతజరుగుతున్నా అటవీశాఖాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తు న్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయగిరి రేంజ్‌పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలోని అనేక గ్రామాల్లోకి నిత్యం ఏదో ఒకచోట పొడదుప్పులు, జింకలు, పందులు సంచరిస్తున్నాయి. ఆరునెలలుగా ఇవి జనవాసాల్లోకి పరుగులు తీస్తున్నాయి. ఉదయగిరి మండలం బిజ్జంపల్లి బీసీకాలనీ, ఉదయగిరి పట్టణంలోని షబ్బీర్‌కాలనీ, బీసీ కాలనీ, పూసల కాలనీ, దిలావర్‌బాయ్‌వీధి, దేవ లాలగడ్డ, ప్రభుత్వ వైద్యశాల, డిగ్రీ కళాశాల ప్రాంతాల్లోకి జింకలు, దుప్పులు చొరబడుతున్నాయి. కుక్కలబారిన పడిన వాటిని స్థానికులు రక్షించి అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉన్నతపాఠశాల క్రీడా మైదానం తదితర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు నాటు బాంబులు పెట్టడంతో పందులు మృత్యువాతపడ్డ సంఘటనలు ఉన్నాయి. దాసరిపల్లి అటవీ ప్రాంతంలో కొందరు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి వధిం చి గుట్టుచప్పుడు కాకుండా మాంసం విక్రయిస్తున్నారు. అలాగే విద్యుత్ కంచెలు తగిలి దాసరిపల్లి గ్రామానికి చెందిన పలువురివి లక్షలాది రూపాయల విలువ చేసే గేదెలు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అటవీ శా ఖాధికారులు అడవుల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించి అడవి జంతువులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి, జూలై 14: స్థానిక ఆర్టీసీ కార్యాయంలో మంగళవారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరిప్రాంత ప్రయాణికులు సెల్:99592 25095 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియచేయాలన్నారు.

18 నుంచి సభ్యత్వాల నమోదు

ఉదయగిరి రూరల్, జూలై 14: ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ నాలుగవ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదిరోజుల పాటు కార్యక్రమంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా, రూ.50వేలు ప్రమాదబీమా లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి, జూలై 14: మండలంలోని మిట్టపల్లి, కొట్టాలపల్లి గ్రామాల ఆరాధ్య దైవం పోలేరమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. మహిళలు కొత్త బుట్టల్లో కాయాకర్పూరం, నైవేద్యం ఆలయ వద్దకు అమ్మవారికి పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఇరు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాల్లో నిర్వాహకులు భక్తులకు సహాపంక్తి భోజనం ఏర్పాటు చేశారు.

సోమశిలలో ప్రముఖులకు ఘన స్వాగతం


మంత్రులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తున్న పండితులు

అనంతసాగరం, జూలై 14: సోమశిల డ్యాం సందర్శనకు ఆదివారం వచ్చిన రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరావు, కాకర్ల సురేష్, పాశం సునీల్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిలను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సోమేశ్వరుడి ఆలయం వద్దకు మంత్రులు చేరుకోగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలువురు నాయకులు సమస్యలతో కూడిన అర్జీలను వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షురాలు సునీత, మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, శాకమూరి సుబ్బారావు, చల్లా శివారెడ్డి, చల్లా నర్సారెడ్డి, ఉప్పల విజయ్‌కుమార్, వేగు పెంచలయ్య, లక్ష్మిరెడ్డి, మనోజ్‌రెడ్డి, తిరుపతి నాయుడు, శాకమూరి వెంకటేశ్వర్లు, రాపూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలువాయి: సోమశిల జలాశయం పరిశీలనకు కలువాయి మీదుగా వెళుతున్న ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణలను కలువాయిలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. సోమశిల, కండలేరు కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు సోమశిల నీరు అందించాలని ఇరిగేషన్ మంత్రి రామానాయుడుకు విన్నతిపత్రం అందజేశారు. డీఎస్‌ఈ-98 ఎంటీఎస్ ఉపాధ్యాయుల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వీసు క్రమబద్దీకరణ, పింఛన్ మంజూరు, కౌన్సిలింగ్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మంత్రులకు ఉపాధ్యాయులు విన్నతిపత్రం ఇచ్చారు. వీరితో పాటు ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు టి.నాగేశ్వరావు విన్నతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

ఉదయగిరి రూరల్, జూలై 14: మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం సోదరులు జరుపుకునే మొహరం వేడుకలు (పీర్ల పండుగ) ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాగులబావివీధి పీర్లచావిడిలో పీర్లను ముస్తాబు చేసి నిలిపారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నాగులబావివీధి యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గుంత బజార్‌లో మేళతాళాలతో పీర్ల ఊరేగింపు చేపట్టారు. హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

సీతారామపురం: మండలకేంద్రంలో పీర్ల చావిడ్లను విద్యుత్ దీప, పూల అలంకరణలతో ముస్తాబు చేశారు. కొట్టవీధి పీర్ల చావిడి వద్ద మౌలాలి స్వామి, సర్కార్ పీర్ల పరిగత్తు వేడుకలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో బాణాసంచా పేలుస్తూ వీధులలో పీర్ల ఊరేగింపు చేపట్టారు. పసుపులేటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీర్లకు ప్రత్యేక పూ జలు చేసి అన్నదానం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

సీతారామపురంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ అనూష పీర్ల ఊరేగింపు జరుగు ముఖ్యమైన మూడు ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఉత్సవ కమిటీలు నిబంధన ప్రకారం నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు.


మర్రిపాడు: పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు


ఉదయగిరి రూరల్: నాగులబావివీధిలో కొలువుదీరిన పీర్లు

మర్రిపాడు: మండల ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు ఏడురోజుల నుండి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడోరోజు ఆదివారం మర్రిపాడు, పల్లవోలు, నందవరం, అల్లంపాడు, పిఎస్‌పల్లి గ్రామాల్లో మంగళ వాయిద్యాలతో పీర్లను వీధుల్లో ఊరేగించారు. కులాలమతాలకు అతీతంగా గ్రామస్థులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఇంటి ముందుకు వచ్చిన పీర్లకు మహిళలు హారతులు పట్టారు.

కలువాయి: మండలకేంద్రంలోని హసేన్ పీర్లను పిల్లలతో గుర్రాలపై ఊరేగించారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో చండీయాగం

సంగం, జూలై 14: పెన్నానది సమీపంలో వెలసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు వేదపండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. అంతకుముందు మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి చందనాలంకారం ఏర్పాటు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నిరుపేదలకు జనసేన చేయూత


సరుకులు అందచేస్తున్న నాయకులు

సంగం, జూలై 14: కోలగట్లలో ఇద్దరు నిరుపేద మహిళలకు జనసేన నాయకులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పూట గడవడమే కష్టంగా కాలం వెళ్లదీస్తున్న ఈ కుటుంబాలను గుర్తించి నెలకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె, ఇతర సామగ్రిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శ్రీధర్, స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


జాఫర్‌సాహెబ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూలై 14: పదవీవిరమణ పొందిన గండిపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం షేక్‌జాఫర్ సాహెబ్‌ను ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, యూటీఎఫ్ మండల సభ్యులు సన్మానించారు. అంకితభావంతో పనిచేసి అవార్డులు పొందారని వక్తలు కొనియాడారు. ఎంఈవోలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, షేక్ ఖాజామొహిద్దీన్, విశ్రాంత ఎంఈవోలు మోహన్‌రావు, నారాయణరావు, ఓబులరెడ్డి, అల్లాభక్షు, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఫణిరాజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆత్మకూరు, జూలై 14: ఆషాడమాసంలో వచ్చే గురుపౌర్ణమి సందర్భంగా గురుశిష్యుల సంబంధాలను తెలియజేస్తూ ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం అశ్వనీపురం, నువ్వూరుపాడు, జంగాలపల్లి, మహిమలూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథా లను చదివి ఆత్మ, పరమాత్మ, జీవాత్మ అనే విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ప్రబోధ సేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షులు పెంచలనరసయ్య, సభ్యులు పెంచల స్వామి, సుధాకర్‌ఆచారి, హరి, అభినయన, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు చెరువును పరిరక్షించాలి


తూములను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 14: శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి ఆత్మకూరు చెరువును పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా పరిరక్షించాల్సి అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలురైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, గంటా లక్ష్మీపతి తెలిపారు. ఆదివారం రైతు సంఘం నాయకులతో కలిసి ఆత్మకూరు చెరువు తూములను పరిశీలించి మాట్లాడారు. చెరువు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసేందుకు తూములు పనికిరాకుండా ఉన్నాయని వాపోయారు. 3వేల ఎకరాలకు పైబడి ఉన్న సాగునీరు అందించే ఈ చెరువు కింద ఉన్న పంట కాలువలు అధ్వానంగా ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఒక తూము ద్వారా సాగునీరు సరఫరా అవసరం లేకుండా పోయిందన్నారు. రెండవ నెంబరు తూము ఆయకట్టు సగానికి సగం తగ్గిందని, 1600 ఎకరాలకు సాగునీరు అందిం చే మూడో నెంబరు తూము పంట కాలువలో ఏపుగా తుంగ, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉన్నా యన్నారు. మంత్రి ఆనం స్పందించి చెరువును పూర్తిస్థాయిలో రైతులకు ఉపయో గపడే తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అంబేడ్కర్ సిద్ధాంతాలపై అధ్యయన తరగతులు

కలువాయి, జూలై 14 : స్థానిక ఏడీపీఎస్ కార్యాయలంలో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలపై అధ్యయన తరగతులు నిర్వహించారు. ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీపీఎస్ వ్యవస్థాపకులు ఇంగిలాల రామచంద్రరావు, ఏడీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కావ్య పర్యటన

అల్లూరు, జూలై 14: కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం అల్లూరులో పర్యటించనున్నారని ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూరల్, అర్బన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల మండలాధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

సోమశిల నుంచి రాళ్లపాడుకు నీరందించాలి

● ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి


మంత్రి రామానాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంటూరి

కందుకూరు, జూలై 14: సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు అందాల్సిన 1.5 టీఎంసీల నీరు ప్రతి ఏటా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రి సోమశిల ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సందర్భంగా అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈమేరకు నియోజకవర్గంలో సాగునీటి చెరువుల దుస్థితిని విన్నవించినట్లు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల నుంచి రావాల్సిన నీరు రాకపోతుండటంతో కొన్నేళ్లుగా ఆయకట్టు రైతులు వరిసాగుకు దూరంగా ఉంటున్నారని, గత ప్రభుత్వంలో సోమశిల నుంచి సక్రమంగా నీరందలేదని ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆ సమస్య రాకుండా సోమశిల నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా రాళ్లపాడుకు అందాల్సిన 1.5 టీఎంసీలు అందేలా చూడటం ద్వారా ఆయకట్టులో వరిసాగుకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులు దశాబ్దాలుగా ముందుకుసాగటం లేదని, గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ రూ. 27 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా ఒక్కపైసా కూడా విడుదల కాలేదని మంత్రికి వివరించి తక్షణం ఎడమకాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదలచేయాలని, చిన్ననీటి చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు.

మంత్రి నిమ్మల దృష్టికి కావలి సాగునీటి సమస్యలు


మంత్రి నిమ్మలకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జూలై 14: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆదివారం నెల్లూరులో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రితో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని కావలి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు భావిస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


భగవద్గీత ప్రచారంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొండాపురం, జూలై 14: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీ కృష్ణభగవానుడేనని తెలియచేసే త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సేవాసమితి సభ్యులు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించారు. ఈనెల 21వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు చేయాల్సిన పూజలపై ఇస్కుదామెర్ల, పొట్టిపల్లి, వెలిగండ్ల గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి ప్రసాద్, సభ్యులు కె వెంకటేశ్వర్లు, జి పెంచలరత్నం, నరసింహులు, టి రమణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కావలిటౌన్, జూలై 14: పట్టణంలోని జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్ ఆవరణలో ఆదివారం డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ఉచిత వైద్య శిబిరం జరిగింది. పాఠశాల కరస్పాడెంట్ రమణయ్య, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు వైద్య శిబిరం ప్రారంభించారు. విజయకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వాకర్స్ 3కే రన్ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎన్‌ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 14: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆగస్టు 4వ తేదీన నిర్వహిస్తున్న 3కే రన్ పోటీల కరపత్రాలను ఆదివారం గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజ్ మాట్లాడుతూ పోటీలో పాల్గొనేవారు ఈ నెల 25వ తేదీలోపు 150 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్, సత్యం, సుధాకర్, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

ఇమాంఖాసీంకు లంగర్ల ప్రదానం


లంగర్లు ప్రదానం చేస్తున్న ముస్లింలు

అల్లూరు, జూలై 14: మొహర్రం పర్వదినాలను పురస్కరించుకొని ఏడోరోజైన ఆదివారం అల్లూరు తూర్పు మహమ్మదీయ పాలెంలోని ఇమాంఖాసీంకు లంగర్లు ప్రదానం చేసే ఆచారాన్ని అనుసరించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అగ్నిగుండం ప్రవేశ కార్యక్రమం చేపట్టిన ముస్లింలు వారి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా భక్తుల మొక్కుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నుంచి లంగర్లు ఆచారాన్ని పాటించారు. అనంతరం రాత్రి ఇమాంఖాసీం పీర్లను గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు విశేషంగా పాల్గొని ఇమాంఖాసీం పీరును దర్శించుకొని ఫాతెహాలను నిర్వహించారు.

దళిత మహిళను హత్యచేసిన వారిని అరెస్టు చేయాలి

ఉలవపాడు, జూలై 14: కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ బసివి గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి అతి కిరాతకంగా చంపిన దుండగులను వెంటనే అరెస్టు చేసి మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు ఎన్ నాగరాజు, ఆర్ మోహన్ సంయుక్త ప్రకటనలో కోరారు. గుండమ్మకు అండగా ఉన్న పురుషోత్తమరెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి గుండమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అత్తలగుంట చెరువు ఆక్రమణలు తొలగించాలి


ఆక్రమణకు గురైన చెరువు భూములను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు

బిట్రగుంట, జూలై 14: అత్తలగుంట చెరువు ఆక్రమణలను తొలగించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని నాగులవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి అధికారులను కోరారు. బోగోలు మండలం సుందరగిరివారి కండ్రిక పంచాయతీ భాస్కరగిరివారి కండ్రికకు చెందిన అత్తలగుంట చెరువును ఆదివారం రైతులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34.70 ఎకరాల అత్తలగుంట చెరువు 26 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా చెరువు ఆక్రమణలు జరిగాయని తెలిపారు. చెరువు ఆక్రమణలు తొలగించి చుట్టూ హద్దులు ఏర్పాటుచేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు తిరుపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, వెంకారెడ్డి బత్తుల తిరుపాల్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాల పార్కింగ్

● అవస్థలు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని పోలీసులు


రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

కావలి, జూలై 14: కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్కడే ట్రాఫిక్ పోలీస్ పాయింట్ ఉన్నా రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆమార్గంలో రూ. 50లక్షలు ఖర్చుపెట్టి సీసీ రోడ్డు నిర్మించినా దానిని వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటున్నందున ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. రోడ్లు ఆక్రమించి వ్యాపారులు ముందుకు రావడం, కొనుగోలు కోసం వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్కడ ఆటలాడితే ఆసుపత్రి పాలే..!

● కంకరతో నిండిన మినీ స్టేడియం


రాళ్లతో నిండివున్న మినీ స్టేడియం మైదానం

కావలిటౌన్, జూలై 14: కావలి పట్టణ మినీ స్టేడియంలో ఆటలాడితే ఆసుపత్రి పాలవ్వాల్సిందేనని స్థానిక క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2001లో కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో మినీ స్టేడియం కోసం ప్రభుత్వం 9 ఎకరాలు స్థలం కేటాయించింది. అప్పటి నుంచి ఎలాంటి నిర్మాణాలు జరగనప్పటికీ పిల్లలు ఆడుకునేందుకు అనువుగా ఉండేందుకు మైదానం లెవలింగ్ పనులు చేశారు. మాగుంట పార్వతమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ. 10లక్షలతో మైదానం లెవలింగ్ పనులు చేపట్టగా, మట్టితో లెవలింగ్ చేయాల్సి వుండగా బొంతరాయితో లెవలింగ్ చేయడంతో ఆటలాడేందుకు అనువుగా లేక మైదానం నిరుపయోగంగా వుంది. పిల్లల క్రీడల సాధనకు, పోటీల నిర్వహణకు నోచుకోలేదు. 9ఎకరాల మైదానం మొత్తం రాళ్ళతో నిండివుండడంతో గాయాలపాలవ్వడం సాధారణ చర్యగా మారింది. స్టేడియం నిర్మాణం మాటేమోగాని మైదానంలోని కంకరను తొలగించి మట్టితో లెవలింగ్ చేస్తే పిల్లలు ఆడుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

సమస్యల వలయంలో ప్రశాంతికాలనీ

ఇళ్లముందే శ్మశానంతో ప్రజల ఇబ్బందులు


డ్రెన్‌లో నిలిచిపోయిన వర్షపునీరు

కందుకూరు, జూలై 14: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతికాలనీ వాసులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పామూరు రోడ్డు చెంతనే ఉన్న ఈకాలనీ వద్ద వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా లక్షల రూపాయలు వెచ్చించి పెద్ద డ్రైనేజి నిర్మాణం చేసినప్పటికీ ఆనీరు ఎటు వెళ్లాలో మార్గం ఏర్పాటుచేయకుండా కాలువ నిర్మించి వదిలేయటంతో వర్షం వస్తే కాలనీవాసులకు తిప్పలు తప్పటం లేదు. డ్రైనేజీ కాలువ నిర్మించక ముందు ఈ సమస్య లేదని, కాలువ నిర్మించి వదిలేయటంతో కాలువ పొంగి కాలనీకి నీరు ముంచెత్తుతోందని, దీంతో దోమలు వృద్ధిచెంది వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. గతంలో పంట పొలాల గుండా వర్షపునీరు వెళ్లేదని అయితే ప్రస్తుతం చుట్టూ వెంచర్లు వేసిన భూయజమానులు వర్షం నీరు వెళ్లకుండా అడ్డం వేయటంతో సమస్యగా మారిందని, పామూరు రోడ్డుకి అభిముఖంగా కాలువ నిర్మించిన అధికారులు సబ్‌స్టేషన్ వరకు కచ్చా డ్రైయిన్ అయినా ఏర్పాటుచేస్తే నీరు సాఫీగా పోతుందని, అయితే కాలువ నిర్మించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమీపంలోని కల్లూరి కోటయ్య ఎస్టీ కాలనీకి మా ఇళ్లముందు మూడు సెంట్లు స్థలాన్ని శ్మశానంగా కేటాయించటంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, రోడ్డు పక్కనే చాలీచాలని స్థలంలో శ్మశానం ఏర్పాటుచేయటం సమంజసం కాదని, వారికి అనువైన స్థలంలో శ్మశానం ఏర్పాటుకు అధికారులు తగు చర్యలు తీసు కోవాలని ప్రశాంతి కాలనీ వాసులు కోరుతున్నారు.